ANDHRA JYOTI. Vijayawada Regd. No H 848

ఉదయం

Telephone: 4343

122330



ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

ముద్దు: మూల్యం

బ్యాంకాక్, ఏప్రిల్ 18— ఇక్కడికి విహారార్థం వచ్చిన ఒక ఆస్ట్రేలియన్ యాత్రికుడు తనను 50 డాలర్స్ (థాయ్‌లాండ్ బదులు) అడిగిన ఒక యువతికి వాటిని యిస్తున్న సమయంలో ఆమె ఆకస్మికంగా అతడిని ముద్దు పెట్టుకున్నది. అంత చక్కగా ఆ సుందరి కృతజ్ఞత చూపించినందుకు అతడు ఎంతో సంతోషించాడు. తీరా అతడు హోటలుకు వెళ్ళి చూచుకునేసరికి జేబులో పరు లేదు పాపం. ఆస్ట్రేలియా రాయబార కార్యాలయం సహాయంతో అతడు స్వదేశానికి వెళ్ళవలసి వచ్చింది.

సంపుటి 7 :: సంచిక 285 | విజయవాడ, ఏప్రిల్ 19, 1967 బుధవారం | 6 పేజీలు :: 12 పైసలు

షెడ్యూల్డు జాతులకు, తరగతులకు గృహవసతి కల్పన

నివేశన స్థలాల సేకరణ కార్యక్రమ ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, ఏప్రిల్ 18—

షెడ్యూలు తరగతులు, జాతుల కోసం నివేశన స్థలాలను సేకరించే బాధ్యత వహించడానికి నేడు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఇంతవరకు ఈ కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్యసంస్థలు నిర్వహించాయి.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నేడిక్కడ మూడుగంటలపాటు జరిగింది.

ప్రభుత్వం కొత్త నిర్ణయం షెడ్యూల్డు జాతులకు మరిన్ని ప్రయోజనాలను సమకూర్చడానికి తోడ్పడగలవని అధికార ప్రతినిధి అన్నారు.

రాష్ట్ర మంత్రివర్గం తీసికొన్న మరొక నిర్ణయం ప్రకారం గిరిజనప్రాంతాలకు మంజూరైన నిధులన్నిటిని ఇకనుండి సమాజశాఖవారు పంపిణీ చేస్తారు. ఈ నిధులు ఇంతకు పూర్వం పంచాయతీశాఖ ద్వారా పంపిణీ అయ్యేవి.

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ విద్యాశాఖ అధీనంలో వున్నందువల్ల ఆ యనపై పంచాయతీ రాజ్య శాఖకు అజమాయిషీ లేనందువల్ల ఈ మార్పు చేయవలసి వచ్చినట్లు అధికార ప్రతినిధి వివరించారు.

వర్గీకరణ జరగని గిరిజన జాతుల వ్యవహారాలను గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరి అజమాయిషీ కింద వుంచాలని కూడా మంత్రి వర్గం నిశ్చయించింది.

ఫిలిం ఇన్‌స్టిట్యూట్ స్థాపనకు సంకల్పం

కళల ప్రదర్శనా కార్యక్రమంలో భాగంగా ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు సమాచారశాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వెల్లడించారు.

ఈ సంస్థను సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తుంది.

ఫిలిం పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నిపుణులకు శిక్షణ గరపడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం కాగలదని మంత్రి అన్నారు.

రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో విద్యనభ్యసిస్తున్న అభ్యర్థులకు విద్యార్థి వేతనాలిస్తున్నదని ఆయన చెప్పారు.

1965-66 లో నాగ్పూర్ వేర్వేరు కోర్సులను అభ్యసించిన నల్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండువేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్పులను మంజూరు చేసినట్లు ఆయన తెలియజేశారు.

ఆ వాళ్లు స్కాలర్‌షిప్పులు ఈ ఏడాది కూడా కొనసాగగిలవని ఆయన అన్నారు.

1966-67 లో ఆరు వేర్వేరు కోర్సులను చదివిన అర్హులు విద్యార్థులకు ఒక్కొక్కరికి 1200 రూపాయల చొప్పున విద్యార్థి వేతనాలను ఇచ్చినట్లు కూడా మంత్రి ప్రకటించారు.

ప్రమాదకరమైన సలహా

"మద్రాసును ఆంధ్రులు అనుకరించాలి"-ఒక సన్మానసభలో శ్రీ వి. బి. రాజు

ఇరాన్‌లో విమాన ప్రమాదం

23 మంది మరణించినట్టు అనధికార వార్తలు

టెహరాన్, ఏప్రిల్ 18— ఇరాన్‌కు చెందిన ఎ-30 రవాణా విమాన మొకటి నేడు టెహరాన్ వెడుతుండగా మార్గంలో కూలిపోయింది. షీరా నుంచి ఈ విమానం టెహరాన్ వస్తున్నది. విమానంలో వున్న ప్రయాణీకులు అంతా మరణించి వుండవచ్చునని భావిస్తున్నారు.

విమానంలో 23 మంది ప్రయాణీకులున్నారని, వారంతా మరణించారని ఇక్కడకు అందిన అనధికార వార్తలను ధ్రువీకరించడానికి వైమానిక దళాధికారులు నిరాకరించారు.

ఈ విమానం షీరా నుంచి టెహరాన్ వెడుతుండగా విరుగుపాటువల్ల ప్రమాదానికి గురయినదని తెలుస్తున్నది.

త్వరలోనే ఒక "ఫిలిం ఇన్‌స్టిట్యూట్" సంస్థాపన

రాష్ట్రపతి పదవికి ఎన్నిక

ప్రధానిపై శ్రీ ద్వివేది ఆరోపణ ఖండన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—

రాష్ట్రపతి పదవికి ఎన్నికల సందర్భంగా ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి మత విద్వేషాన్ని రెచ్చగొట్టారని పి ఎస్ పి. నాయకుడు శ్రీ ఎన్ ఎన్ ద్వివేది చేసిన ఆరోపణ అనుచితమైనదిగా ఇదరు సీనియర్ పార్లమెంట్ సభ్యులు దివాన్ చమన్ లాల్, అర్జున అరోరాలు నిన్న అభివర్ణించారు.

వాస్తవంగా పి. ఎస్. పి ఉభయకమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులలో మత సంకుచితత్వాన్ని రెచ్చగొడుతున్నట్టు వారు పేర్కొన్నారు.

డాక్టర్ జాకీర్ హుస్సేన్‌ను రాష్ట్రపతి పదవికి బలపరచడానికి మత సంబంధమైన ఒక పార్టీ పైముఖ్యాన్ని ప్రదర్శించడంవల్ల డాక్టరు హుస్సేనుకు పోటీ పెట్టడానికి ప్రతిపక్షాలు నిర్ణయించాయని వారు అరోపించారు.

అత్యున్నత మైన రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా డాక్టర్ జాకీర్ హుస్సేను కాంగ్రెసు పార్టీ నిరాయించింది కేవలం ఆయన ముస్లిం అని కాదని. దేశానికి ఆయన చేసిన సేవల వల్లనే అని వీరిద్దరు వివరించారు.

రాష్ట్రపతి పదవికి జరుగనున్న ఈ పోటీ మధ్య మతాతీత వ్యవస్థకే పరీక్ష అని. ఏ వ్యక్తిని గాని కేవలం ముస్లిం అన్న కారణంపై తొలగించడం జరగరాదన్నది. కాంగ్రెసు అభిమతమని వారు చెప్పారు.

ప్రధాని గాంధిపై అరోపణ చేయడం అనుచితమని, కాంగ్రెసుకు తక్కిన ప్రజలకు మధ్య ఈ పోటీ జరుగుతున్నదని శ్రీ ద్వివేది ఏకటించడం సబబుకాదని వారు పేర్కొన్నారు

కాంగ్రెసుకు దేశంలో ఇప్పటికి అధిక మెజారిటీ వున్నదని వారు తెలిపారు.

కాంగ్రెసుకు దేశంలో ఇప్పటికి అధిక మెజారిటీ వున్నదని ఆయన తెలిపారు.

శ్రీ కోకా సుబ్బారావుకు ఢిల్లీ న్యాయవాదుల సమర్థన

రాష్ట్రపతి పదవికి కాంగ్రెసు అభ్యర్థి ప్రకటన కోసం మతాతీత దానాన్ని పనిపోగొట్టడంలో జరుగుతున్న వంచనను విమర్శిస్తూ, ఢిల్లీలో అనేక బార్ అసోసియేషన్‌లకు చెందిన 250 మంది న్యాయవాదులు ఒక మెమొరాండంపై సంతకాలు చేశారు.

రాష్ట్రపతి పదవికి పోటీచేయడానికి శ్రీ కోకా సుబ్బారావు అంగీకరించడాన్ని విమర్శిస్తూ శ్రీ ఎం. సి. సెతల్వాడ్ చేసిన ప్రకటనలో తమ కెట్టి సంబంధం లేదని కూడా వారు ఆ మెమొరాండంలో స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల నామినేషన్‌ను ధైర్యంగా అంగీకరించినందుకు శ్రీ సుబ్బారావునివారు అభినందించారు.

ఇటీవల ఎన్నికల తరువాత దేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడినప్పటికంగా రాష్ట్రపతి పదవికి పార్టీలకు అతీతంగావుండే వ్యక్తిని ఎన్నుకోవలసిన అవసరత ఏర్పడినదని. శ్రీ సుబ్బారావు అందుకు తగిన వ్యక్తి అని. దేశంలో మతాతీత విధానం అభివృద్ధికి ఆయన దోహదం చేయగలరని ఆ మెమొరాండంలో పేర్కొన్నారు.

మెమొరాండంపై సంతకాలు చేసిన వారిలో శ్రీ ఎం. కె. పంచి యార్. మరి పెక్కు మంది పార్లమెంటు సభ్యులు కూడా వున్నారు.

పశ్చిమ బెంగాల్ బార్ అసోసియేషన్ మద్దతు

ప్రస్తుతపరిస్థితులలో మన దేశానికి రాష్ట్రపతిగా ఏ పార్టీకి చెందని శ్రీ కోకా సుబ్బారావు ఎన్నిక కావడం చాలా అవసరమని పశ్చిమ బెంగాల్ బార్ అసోసియేషన్ నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నది.

లఘుపరిశ్రమలఅభివృద్ధికివిద్యుచ్ఛక్తి రేటు తగ్గింపు అవశ్యకత

కేంద్ర మంత్రులు శ్రీ రఘునాథరెడ్డి, డాక్టర్ కె. ఎల్. రావు సూచన

విజయవాడ, ఏప్రిల్ 18—

ఆంధ్రప్రదేశ్‌లో చిన్నతరహా పరిశ్రమలు అభివృద్ధి చెందవలసిన అవశ్యకతదృష్ట్యా రాష్ట్ర విద్యుచ్ఛక్తిబోర్డు చిన్నతరహా పరిశ్రమలవారి అవసరాలను సానుభూతితో పరిశీలించి, ఆ పరిశ్రమల అభివృద్ధికి దోహదమివ్వాలని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక అభివృద్ధిశాఖ మంత్రి శ్రీ కె. వి. రఘునాథరెడ్డి ఇరిగేషన్ విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి డాక్టర్ కె.ఎల్. రావు సూచించారు.

ఇక్కడ ప్రభుత్వ అతిథి గృహంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుచ్ఛక్తి అధికారులను లఘు పరిశ్రమల యజమానులు కలిసి తమ సమస్యలను వివరించారు. వీరు జరిపిన చర్చలలో కేంద్రప్రభుత్వ సీటీ పాడు దళం, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షులు శ్రీ సి. నరసింహం రాష్ట్ర విద్యుచ్ఛక్తి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి ఉత్పాదన హెచ్చి వాడకం పెరిగితే యూనిట్ రేటును తగ్గించవచ్చని ఈ చర్చలో పాల్గొన్న రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షులు శ్రీ సి. నరసింహం సూచించారు. ఈ సంవత్సరం విద్యుచ్ఛక్తి సరఫరాలో కోత వుండబోదని కూడా ఆయన సూచించారు. విద్యుచ్ఛక్తి రేటును మే నెలమొదటి తేదీనుంచి హెచ్చిస్తుండటంవల్ల సాలీనా వచ్చేఆదాయంరెండు కోట్లు మాత్రమే వుంటుందని తెలిపారు.

కేంద్రమంత్రి డాక్టర్ కె. ఎల్. రావు లఘు పరిశ్రమలకు తగు సహాయం చేయాలన్నారు.

రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షులు శ్రీ సి నరసింహం సాలీనా విద్యుచ్ఛక్తి బోర్డుకు రు. 4.5 కోట్లు నష్టం వస్తున్నదని రేటు హెచ్చింపువల్ల యూనిట్‌కు ఒకపైసా మాత్రమే నగదున పెరుగుతుందని తెలిపారు.

లఘు పరిశ్రమల యజమానుల పక్షాన శ్రీయుతులు వై. నరసింహారావు, పి. సాంబశివరావు, టి. అప్పారావు, సూరి రామకృష్ణశాస్త్రి, కాజ వెంకట పద్మనాభరావు, కొన్నెల వీరరాఘవయ్య, జాలదిర రాఘవేంద్రరావు, మల్లాది వెంకట కృష్ణయ్య, కె. లక్ష్మయ్య, ప్రభృతులు లఘుపరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేర్కొన్నారు.

సంవత్సరం జూన్ నెలలోగా కొత్త గూడెం థర్మల్ కేంద్రంలో రెండుయూనిట్లు

(మిగతా 4 వ పేజీలో)

రాష్ట్రపతి పదవికి 17 మంది పోటీ

నామినేషన్‌ల ఉపసంహరణ గడువు సమాప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18— రాష్ట్రపతి పదవికి మొత్తం 17 మంది పోటీ చేస్తున్నారు.

వారిలో డాక్టరు జాకీర్ హుస్సేన్, శ్రీ కె. సుబ్బారావు వున్నారు.

నామినేషన్ ఉపసంహరణకు నేటి మధ్యాహ్నం 3 గంటలతో గడువు ముగిసింది. మొత్తం 17 మంది అభ్యర్థులతో ఒక్కడుకూడా తమ నామినేషన్‌ను ఉపసంహరించుకొనలేదు.

ఉపరాష్ట్రపతి పదవికి శ్రీ వి. వి. గిరి. ప్రొఫెసర్ మహమ్మద్ హబీద్ పోటీ చేస్తున్నారు.

అణ్వాయుధాలు లేని దేశాల రక్షణకు హామీ

ఇండియా వైఖరిని స్పష్టీకరించడానికి వివిధ రాజధానులకు శ్రీ ఝా పయనం

న్యూఢిల్లీ ఏప్రిల్ 18—

అణ్వస్త్ర విస్తరణ నిరోధం ఒప్పందంపై ఇండియా విధానాన్ని వివరించడానికి విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ సి. ఎస్. ఝా వివిధ దేశాల రాజధానులను సందర్శించడానికి నేడు కయిరో బయలుదేరారు.

ప్రధాని కార్యదర్శి శ్రీ ఎల్. కె. ఝా కూడా ఇదే విషయాన్ని పురస్కరించుకొని ప్రస్తుతం విదేశాలలో పర్యటిస్తున్నారు.

ఈ పర్యటన ముఖ్యంగా అణ్వస్త్రాలు లేని దేశాలమీద అణ్వస్త్రదాడి జరగకుండా అట్టి ఆయుధాలుగల ఈ దేశాలనుంచి రక్షణ కోరడానికి ఉద్దేశించబడింది. అటువంటి ప్రయత్నం అలీనవిధానానికి విఘాతం కలిగించదు.

విదేశాంగ మంత్రుల సమావేశం జరిగే నాటికి శ్రీ ఝా జెనీవాలో వుంటారు.

జెనీవాలో జరిగే నిరాయుధీకరణ సమావేశంలో వివిధ దేశాల ప్రతినిధి వర్గాలతో విదేశాంగ మంత్రి శ్రీ చాగ్లా సంప్రతింపులు జరిపేటప్పుడు శ్రీ ఝా ఆయనకు సహాయం చేస్తారు. వారు ఈ సమావేశానికి హాజరవుతున్న ఇండియా ప్రతినిధివర్గంతో సంప్రతింపులు జరుపుతారు.

జెనీవాలో ఉండగా శ్రీ చాగ్లా, శ్రీ ఝాలు కచ్ ట్రిబ్యునల్‌కు నియమించబడిన భారత ప్రతినిధిని కలుసుకుంటారు. ఈ సందర్భంలో వారు ట్రిబ్యునల్ చైర్మన్‌ను కూడా ఎరామర్శిస్తారు.

శ్రీ ఝా బెల్‌గ్రేడ్‌లో మూడు రోజుల పాటు సంప్రతింపులు జరుపుతారు. యూరోపియన్ డివిజన్ డైరెక్టర్ శ్రీమతి డిక్సిజీ మీనన్ బెల్‌గ్రేడ్ సంప్రతింపులలో పాల్గొంటారని తెలుస్తున్నది.

ప్రణాళికాసంఘం సభ్యుడు తర్లోక్‌సింగ్ రాజీనామా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—ప్రణాళికాసంఘం సభ్యుడు శ్రీ ర్లోక్‌సింగ్ రాజీనామా సమర్పించినట్టు తెలుస్తున్నది.

దేశంలో ప్రణాళికా విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి శ్రీ సింగ్‌కు దీనితో సంబంధం వున్నది.

శ్రీ సింగ్ మే 31 వ తేదీనుంచి మూడు నెలలపాటు సెలవు తీసుకొనవలసి వున్నది. ఆ కాలంలో ఆయన స్వీడన్‌లో కొన్ని గ్రంథాలను వ్రాయసంకల్పించారట.

మొగ్గలోనే త్రుంచివేసిన తిరుగుబాటు

లండన్ ఏప్రిల్ 18— ఘానాలో తిరుగుబాటుకు సైన్యం యత్నించినదన్న వార్త వెలువడిన తర్వాత అక్రా నుంచి బయలుదేరిన తొలి విమానం లండన్ చేరుకున్నది. ఈ విమానం నిన్నరాత్రి ఢిల్లీపు అక్రాలో ఆగింది.

జాతీయ విమోచన మండలి అధిపత్యాన్ని కూలద్రోయడానికి యువ సైనికాధికారులు చేసిన ప్రయత్నం ఎవరికీ తెలియకుండానే నిష్ఫలమైందని ప్రయాణీకులు తెలియజేశారు.

ఆదివారం రాత్రి అక్రా విమానాశ్రయం సమీపాన వున్న ఒక హోటల్‌లో మకాంచేసిన బి టి షు వైమానిక దళ కెప్టెన్ జాన్ వైట్‌పుట్ ఇలా చెప్పాడు.

"నేను ఉదయం 5 గంటలకు రైఫిల్, చిన్న మరుతుపాకి కాల్పులు విని కిటికీ నుంచి చూశాను. నేను కిటికీ గుండా వెలుపలికి చూచాను. కనుచూపు మేరలో నాకేమీ కనిపించనందున తిరిగి నేను పడుకున్నాను."

అక్రాలో బ్రిటిష్ హైకమిషనర్ కుమారి మిస్ ఫ్రాన్సెస్ న్యూమన్ తన అనుభూతిని తెలుపుతూ ఇలా పేర్కొన్నది:

"తిరుగుబాటుకు ప్రయత్నం జరిగిందన్న విషయం కొందరికి అసలు తెలియనే తెలియదు."

అధికారభవనం చుట్టూ కొద్దిమంది సైనికులు వున్నారు అదిమినహా తక్కినదంతా మామూలుగా వున్నది. నగరంలో ప్రశాంతికి ఎట్టి భంగం కలుగలేదు."

రాజస్థాన్‌లోని పెక్కు ప్రాంతాలలో అకాలవర్షాలవల్ల 11 లక్షల విలువగల పైరులు నష్టమైనట్టు జైపూరు వార్త.

ఆర్థిక, వాణిజ్య రంగాలలో పరస్పర సహకారం

ఇండియా, కువైట్ మధ్య అంగీకారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—

ఇండియా, కువైట్ దేశాలమధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం వున్నట్టు కువైట్‌లో విదేశ వ్యవహారాల మంత్రి శ్రీ చాగ్లా పర్యటన సమాప్తమైన సందర్భంగా ఒక సంయుక్త ప్రకటన వెలువరించబడింది.

ఎంతోకాలంగా స్నేహ సంబంధాలు కలిగిన ఈఇరుదేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య రంగాలలో మరింత సహకారం పెంపొందించుకోడానికి అవకాశ మున్నట్టు పేర్కొనబడింది.

కువైట్‌లో ఈ నెల 9 నుంచి 15 వతేదీ వరకు జరిగిన ఇండో - కువైట్ దేశాల సంయుక్త సమావేశంలో గైకొన్న నిర్ణయం ప్రకారం అభివృద్ధికి రాదగిన పరిశ్రమలను గురించి కువైట్‌లో ఇండియా నిపుణుల బృందంచే సర్వే జరుగవలసి యున్నది.

కువైట్‌కు చెందిన సిబ్బందికి ఇండియాలో శిక్షణసౌకర్యాలనుసమకూర్చడానికి, కువైట్ ప్రభుత్వానికి ఇండియా సంసిద్ధతను వ్యక్తం చేసినట్టు ఆ ప్రకటనలో వివరించబడింది.

ఇండియా, పాకిస్తాన్ దేశాల తమ వివాదాన్ని ఇతరుల ప్రమేయం లేకుండా తాష్కెంట్ ప్రకటన అనుసారం పరిష్కరించుకొనాలన్న భావాన్ని ఇండియా కువైట్ దేశాలు ఆసంయుక్త ప్రకటనలో వ్యక్తం చేశాయి.

స్వాతంత్ర్యం కోసం దక్షిణ ఆఫ్రికా ప్రజలు జరుపుతున్న పోరాటానికి ఇండియా కువైట్ దేశాల విదేశాంగ మంత్రులు తమ పూర్తి మద్దతును తెలియ జేశారు.

ఇరు దేశాల విదేశ వ్యవహారాల మంత్రుల మధ్య జరిగిన చర్చలు ప్రకారం ఎరువుల ఉత్పత్తి రంగంలో కువైట్‌తో ద్వైపాక్షిక అవకాశాలను గురించి ఇండియా పరిశీలించవలసి వున్నది.

కేరళ యూనివర్సిటి వైస్-ఛాన్సలర్‌గా తిరిగి నియమితులైన ప్రొఫెసర్ కామ్యూల్

మత్తాయ్ ఏప్రిల్ 17 వ తేదీన తన పదవీ బాధ్యతలను స్వీకరించినట్టు తిరువేంద్రం వార్త.

విజయవాడలో ఉష్ణోగ్రత

విజయవాడ, ఏప్రిల్ 18—

పట్టణంలో నేడు గరిష్ఠ ఉష్ణోగ్రత 110 డిగ్రీలు

నాగభూమి సమస్య

అమెరికా అధికారులతో చర్చించనున్నట్టు ఫిజో ప్రకటన

న్యూయార్క్, ఏప్రిల్ 18— నాగాల సమస్యను గురించి వాషింగ్టన్‌లోని అమెరికా అధికారులతో త్వరలో చర్చలు జరపగలరన్న ఆశాభావాన్ని తిరుగుబాటు నాగాల నాయకుడు ఎ. జడ్ ఫిజో వ్యక్తం చేసినట్టు పి.టి.ఐ. విలేకరి తెలియజేస్తున్నారు.

న్యూయార్క్ టైమ్స్ పత్రికకు నిన్న ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికాలోని బాప్టిస్టు వర్గాలతో తాను సంప్రతింపులు జరుపుతున్నట్టు ఫిజో తెలియజేశారు. నాగా సమస్య గురించి వాషింగ్టన్‌లోని అమెరికా ప్రభుత్వాధికారులతో చర్చించగలనన్న భావాన్ని ఫిజో ఆ ఇంటర్వ్యూలో వ్యక్తం చేయడం జరిగింది.

ఫిజో బ్రిటన్‌ను నుంచి ఈ నెలారంభంలో ఇక్కడకు వచ్చారు. వాషింగ్టన్‌లోని ఇండియా అధికారులు ఫీసా ఇవ్వరాదని అభ్యంతరం తెలిపినప్పటికి, అమెరికా ఫిజోకు వీసా మంజూరు చేసింది.

వైద్యచికిత్స నిమిత్తం ఫిజో అమెరికా వచ్చినట్టు అమెరికా అధికారులు భారతీయ అధికారులకు, పత్రికలవారికి అప్పుడు తెలియజేశారు.

కేరళ అసెంబ్లీ సమావేశం తిరిగి జూన్ రెండవ వారంలో ప్రారంభం కానున్నట్టు తిరువేంద్రం వార్త.

1967 ఏప్రిల్ 19 బుధవారం
శ్రీ ప్లవంగనామ సంవత్సర
చైత్ర శుద్ధ నవమి
నవమి : మ॥ 12-22 ఆశ్లేష రా॥ 12-05
వర్జ్యం : మ॥ 1-24 నుంచి 2-56 వరకు

1967 ఏప్రిల్ 20 గురువారం
శ్రీ ప్లవంగనామ సంవత్సర
చైత్ర శుద్ధ దశమి
దశమి : మ॥ 10-15 మఘ : రా॥ 10-24
వర్జ్యం : మ॥ 11-15 నుంచి 12-44 వరకు
,, రా॥ 5-40 ,,

ఆంధ్రజ్యోతి
"తమసో మా జ్యోతిర్గమయ"

విఫలమైన తిరుగుబాటు

ఆఫ్రికా ఖండం మరొక లాటిన్ అమెరికా వలె తయారైంది. లాటిన్ అమెరికన్ దేశాలు ఒకప్పుడు కుట్రలకు, కుహకాలకు, సైన్యం తిరుగుబాటులకు, నియంతల వధలకు ప్రసిద్ధి కెక్కాయి. ఇప్పుడు అట్టి వార్తలు ఆ ఖండం నుంచి అంత తరచుగా రావడంలేదు. గాని, దాని స్థానాన్ని ఆఫ్రికా ఆక్రమించింది. ఏదో ఒక దేశంలో సైన్యం తిరుగుబాట్లు సర్వ సాధారణమై పోయాయి.

క్రిందటి నెలలో సియెరాలియోన్‌లో సైన్యం తిరుగుబాటుచేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. నిన్న ఘనాలో సైన్యంలోని ఒక వర్గం తిరుగుబాటుచేసింది. అయితే, అది వెంటనే విఫలమై పోయిందనుకోండి.

ఘనాలో సైన్యం తిరుగుబాటు చేయడం ఇది మొదటిసారికాదు. గతసంవత్సరం ఫిబ్రవరిలో ప్రెసిడెంట్ ఎన్‌క్రూమాను సైన్యం పదవీచ్యుతుని చేసింది. ఆయన విదేశాలలో తలదాచుకొంటున్నాడు. అప్పటి నుంచి ఘనాలో సైనిక పాలన కొనసాగుతున్నది. త్వరలో పౌర పరిపాలనను పునరుద్ధరించగలమని సైనికాధికారులు అప్పటిలో వాగ్దానం చేయక పోలేదు. కాని ఒకసారి అధికారానికి అలవాటు పడిన వారెవరైనా అంత సులభంగా దాన్ని వదలుకుంటారా?

సోమవారంనాడు జరిగిన తిరుగుబాటు సైన్యంలోని యువ తరానికి చెందిన అధికారుల పని అని తెలుసున్నది. వారు అధికారాన్ని హస్తగతం చేసుకున్నట్టు మొదట ఆక్రా రేడియో ప్రకటించింది. కాని, మరికొద్ది గంటలలోనే తిరుగుబాటు అణచివేయబడినట్టు అదే రేడియో ప్రకటించింది.

ఘనాలో ప్రస్తుతం జాతీయ విమోచన సమితి పేరుతో సైన్యం అధికారంలో వున్నది. దాని నాయకుడు జనరల్ జోసెఫ్ అంక్రా. ఆయన చేసిన ప్రకటన ప్రకారం ఘనాలో తిరుగుబాటు ప్రెసిడెంట్ ఎన్‌క్రుమాను తిరిగి అధికారానికి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో జరిగింది కాదు. అది ఎవరో కొందరు యువ సైనికాధికారులు పదవీ వ్యామోహంతో చేసిన దుందుడుకుతనం మాత్రమే.

కారణ మేమైనా తిరుగుబాటు జరగడంలో ఆశ్చర్యంలేదు. సైనిక నియంతృత్వం వున్న ప్రతిచోట తిరుగుబాటు అవకాశాలు వుండనే వుంటాయి. ప్రజలు తమకు నచ్చని ప్రభుత్వాన్ని స్వేచ్ఛాయుతంగా జరిగే ఎన్నికల ద్వారా మార్చివేయడానికి ప్రజాస్వామ్యంలోనే అవకాశం వుంటుంది. అట్టి అవకాశాన్ని పాలక వర్గం సైనికాధికారం ద్వారా అణగద్రొక్కినప్పుడు కుట్రలు, కుహకాలు తప్పవు.

ఘనాలో తిరుగుబాటు విఫలమైపోయింది గదా అని సైనిక పాలకవర్గం ఉదాసీనంగా వుండడానికి వీలులేదు. రేపు మరొకటి జరగవచ్చు. సాధ్యమైనంత త్వరలో సైనిక ప్రభుత్వానికి స్వస్తిచెప్పి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించినప్పుడుగాని రాజకీయ సుస్థిరతను సాధించడం కష్టం. ఏ ఎన్‌క్రూమా నియంతృత్వం నుంచి తాము ఘనాను తప్పించామని సైనిక ప్రభుత్వం చెప్పుకుంటున్నదో ఆ ఎన్‌క్రూమా నియంతృత్వమే మెరుగని ప్రజలు అసంతృప్తులయ్యే వరకు తమ అధికారాన్ని పొడిగించకూడదు. త్వరలో ప్రభుత్వాన్ని ప్రజాస్వామిక పద్ధతిపై పునర్నిర్మించడం మంచిది.

శ్రీ మురార్జీ హామీ

ధరలను అరికట్టడానికి ఒక "వ్యూహం" వంటిది అవసరమని ఉపప్రధాని శ్రీ మురార్జీ దేశాయి మొన్న చేసిన ప్రకటన ఒక గొప్ప సత్యాన్ని దేన్నీ బయటపెట్టడంలేదు. అటువంటి వ్యూహమో, పథకమో, మరొకటో అవసరమని అందరు చిరకాలంగా చెబుతున్నదే. అది ఏ విధంగా వుండాలి, ఏ విధంగా అమలు చేయాలి అన్న విషయమే ఇప్పటివరకు సందిగ్ధంగా వుండిపోయింది.

త్వరలో తాను కొన్ని చర్యలు తీసుకోబోతున్నట్టు కూడా శ్రీ మురార్జీ ప్రకటించారు. ఇది సయితం దేశాన్ని విభ్రాంతిలో ముంచివేయగల ప్రకటన కాదు. చాలాకాలంగా ప్రజలు ప్రభుత్వాధినేతల ముఖతః వింటూ వస్తున్నదే. పాత చింతకాయ పచ్చడైనా పథానికి పనికిరాగలదు గాని, ఈ ప్రకటన అధికధరలతో క్రుంగిపోతున్న ప్రజానీకాన్ని పొంగిపోయేట్టు చేసే అవకాశం సుతరామూ లేదు.

దీనికి కారణాన్ని విడకడానికి పెద్దగా శ్రమపడ నక్కరలేదు. ధరల పెరుగుదలను అరికటడానికి కృషి చేస్తున్నామనో, చేయగలమనో ఒక "రొటీన్" ప్రకారం ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తూ వుంటాయి. వాటిని అమలు చేయగల శక్తి స్తోమత, నిజాయితీ, చిత్తశుద్ధి ఏవీ ప్రభుత్వాలకు లేవని ప్రజలకు తెలుసు. అందువల్లనే వారు ఇట్టి ప్రకటనలను విశ్వసించడం ఏనాడో మానివేశారు. ప్రభుత్వాల అశక్తత ధరలకు కూడా తెలిసిపోయి వుండాలి. అందువల్లనే అవి విశృంఖలంగా విజృంభిస్తున్నాయి.

ఇది కాంగ్రెసు ప్రభుత్వాల సంగతి. కాంగ్రెసేతర ప్రభుత్వాల విషయం కొంత భిన్నంగా వుంది. ఎన్నికల తర్వాత కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడక ముందే కొన్ని రాష్ట్రాలలో ధరలు తగ్గుముఖం పట్టిన వార్తలు వచ్చాయి. మొన్న మొన్న యు.పి లో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడగానే కొన్నిటి ధరలు తగ్గుముఖం చూపినవట. కాగా, కాంగ్రెసు ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో ధరలు యథాతథంగానో, ఊర్ధ్వ ముఖంగానో వున్న సంగతి మనకు విదితమే.

దీన్నిబట్టి, కాంగ్రెసు ప్రభుత్వాలు తమ్ము ఏమీ చేయలేవని, కాంగ్రెసేతర ప్రభుత్వాలైతే తీవ్ర చర్యలు తీసుకుంటాయని ధరలకు తెలుసునని మనం అర్థం చేసుకోవాలా? ధరలు అచేతనమైనవి కావు. మానవులవలె, ముఖ్యంగా బ్లాక్‌మార్కెట్లర్లవలె, దొంగ నిల్వదార్లవలె సచేతనమైనవే. "దండం దశగుణం భవేత్" అన్నట్టు అవికూడా దండనీతికి భయపడతాయి.

ధరలను అరికటడానికి వ్యూహరచన చేసే ముందు ఆ వ్యూహం విజయవంతం కావడానికి తగు వాతావరణాన్ని, ముఖ్యంగా మానసిక వాతావరణాన్ని, శ్రీ మురార్జీదేశాయి కల్పించాలి. నిత్య వినియోగవస్తువులను దాచివేయడం, కృత్రిమంగా కొరతను సృష్టించడం, వాటి ధరలను యథేచ్ఛగా పెంచివేయడం చట్టబద్ధమైన దండనకు దారి తీస్తుందనే భీతిని సృష్టించాలి. ప్రభుత్వం మాటలతోనే సరిపెడుతుందనే అలసభావాన్ని పోద్రోలాలి; అవసరమైనప్పుడు కాఠిన్యం వహించగలదనే భయాన్ని కల్పించాలి. లేకపోతే శ్రీ మురార్జీ వ్యూహం పెక్కు ఇతర శాసనాల రీతిగానే విఫలంకాక తప్పదు.

పనికిరాని ధీమా

"ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు; రది యెట్లన్నన్
దెప్పలుగ జెరువు నిండిన
గప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!"

సుమతీ శతకంలోని ఈ సుభాషితానికి సరిపోలినది తమిళంలో వున్నదో లేదో మాకు తెలియదు గాని, దానిలోని నీతి మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ అన్నాదొరైకి తెలిసి వుండదు తెలిస్తే, ఆయన మొన్న మదురైలో ఏదో సభలో మాట్లాడుతూ, తమ మంత్రివర్గానికి మరి ధోకా లేదని అంత ధీమాగా చెప్పి వుండరు. దానికి కారణం తమ పాత శత్రువులందరు ఇప్పుడు మిత్రులై పోవడమేనని అని వుండరు.

కాంగ్రెసు గాని, కాంగ్రెసేతర పక్షాలు గాని ప్రభుత్వాలను ఏర్పరచిన రాష్ట్రాలలో పరిణామాలు చూస్తూ కూడా శ్రీ అన్నాదొరై ఈ మాటలు ఎలా అన్నారో? రాజకీయాలలో శాశ్వతశత్రువులు, శాశ్వతమిత్రులుఅంటూవుండరు. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ చుట్టూ— బెల్లంమీద ఈగలు వాలినట్టు— "మిత్రులు" మూగుతారు. అధికారంలో వున్నన్నాళ్లు మైత్రి నటిస్తారు. పర్మిట్లకోసమో, కోటాల కోసమో, లైసెన్సులకోసమో మంత్రులను ఆశ్రయిస్తారు; భజన చేస్తారు.

అధికారం పోగానే, లేదా పోతున్నట్టు సూచన కనబడగానే ఎక్కడి మిత్రులు అక్కడే చెల్లాచెదరై పోతారు. రాజకీయ శత్రుత్వంలో గాని, మిత్రత్వంలోగాని ఇంతకు మించిన రహస్యం ఏముంది?

రాష్ట్రపతి ఎన్నికలో తలయెత్తిన కొన్ని సమస్యలు

వెనుకన్న కాంగ్రెసు వర్కింగ్ కమిటీ చర్చలను పరిశీలిస్తే ఎన్నికల నుంచి కాంగ్రెస్ నాయకులు గుణపాఠాలను నేర్చుకున్నట్టు కనిపించదు. అయితే పరిస్థితిని గురించి వర్కింగ్‌కమిటీ సరిగానే సమీక్షించినట్టు చెప్పాలి. కాంగ్రెసుప్రభుత్వం పతనమైనచోటల్లా ప్రజలు "అమ్మయ్య" అనుకున్నారు. దేశంలోని అవినీతిని పారద్రోలడానికి పరిపాలనా సంస్కరణల సంఘం సూచించిన రీతిగా "ఆంబుడ్స్‌మన్"ను నియమించడం అవసరమని కొందరు సూచిస్తున్నారు. బందుప్రీతి, అవినీతి ఆరోపణలు చేయబడిన ప్రధాన రాజకీయ వేత్తను ట్రిబ్యునల్ ముందు హాజరు పెట్టడానికి అవకాశం వున్నప్పుడే ఇది ఫలితమిస్తుంది. ఈ సందర్భంలో సంతానం కమిటీ నివేదిక కూడా వుంది.

కాని, ముఖ్య విషయ మేమంటే, ఆలస్యం లేకుండా నిర్ణయం తీసుకుని, ఈ సూచనలను వెంటనే అమలు పరచాలి. తాను తీసుకున్నట్టు ప్రతి పక్షాలవారు ఆరోపించిన బహుమతుల విషయమై ఆంబుడ్స్‌మన్ చేత విచారింపజేస్తే ప్రధాని ఆదర్శప్రాయురాలు కాగలదు.

తాను ఒక ప్రక్క సోషలిస్టు వినాదాలు వల్లిస్తుండగా మంత్రులను చేయడంలోను, మార్చడంలోను డబ్బు ఎలా ప్రాధాన్యం వహిస్తున్నదో కాంగ్రెసు పరిశీలించాలి. భూసంస్కరణలవల్ల భూస్వామ్య వర్గాలు కొంతవరకు తుడిచిపెట్టుకుపోయినా, వారి స్థానం ధనంఆక్రమించింది. ఎన్నికల సమయంలో అనేక రాష్ట్రాలలో ముఖ్యంగా రాజస్థాన్‌లో ఈవిషయం విరూపరీతమైనది. ఒక ప్రముఖ వ్యాపార సంస్థ ఒత్తిడి ఫలితంగానే ఒక మంత్రిని తీసుకొన్నట్టు ప్రధానిపై ఆరోపించబడుతున్నది. ఎన్నికలో గెలవడానికి గాని, ఓడిపోవడానికిగాని ధనం ముఖ్యమైనట్టిదిగా పరిగణించబడుతున్నది. కాంగ్రెసు సోషలిజమే తన సిద్ధాంతమని చెబుతున్నప్పటికీ, ఇదంతా ఎలా సాధ్యమవుతున్నది?

పోతే, కాంగ్రెసులోని ఉన్నత వర్గాల మధ్య సయోధ్యను సాధించడం ఎలా? ప్రతిసమస్య ప్రధాని, కాంగ్రెసు అధ్యక్షుల మధ్య వివాదానికి దారి తీస్తున్నది. దీనిబట్టి శ్రీ కామరాజ్‌ను ఢిల్లీనుంచి వంపవేయాలని శ్రీమతి గాంధి సహచరులు యత్నిస్తున్నారన్న అనుమానం శ్రీ కామరాజ్ అనుయాయులలో కలుగుతున్నది. అవకాశవాదులైన కొందరు సాహసిక సలహాదార్లపైన ఆధారపడడం వల్లను, రాజకీయ అపరిపక్వత వల్లను శ్రీమతి ఇందిర అనేక వ్యవహారాలలో పొరపాట్లు చేసున్నదని కామరాజ్ అనుయాయులు ఆరోపిస్తున్నారు.

పోతే, కాంగ్రెసు నాయకులు కొందరు వ్యక్తిగతంగా సేకరించిన ఎన్నికల నిధుల సమస్య వుంది. ఈ సమస్యపైనే బ్రిటన్‌లో లిబరల్ పార్టీ విచ్ఛిన్నమైనది.

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులు

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు నెలరోజుల క్రితమే కాంగ్రెసు అభ్యర్థులను నిర్ణయించడం జరిగింది. కాని, ప్రధాని, కాంగ్రెసు అధ్యక్షులమధ్య అభిప్రాయ భేదాల కారణంగా ఈ విషయంలో కాంగ్రెసుకు చొరవ తీసుకోలేకపోయింది. ఇప్పుడు కాంగ్రెసువార్టీ ఈ విషయంలో విభేదాలను విస్మరించి, తన అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నదని భావించవచ్చు. ఈసమస్యపై ప్రధాని, ఉపప్రధాని, హోం మంత్రి కాంగ్రెసేతర ముఖ్యమంత్రులతో కూడా మంతనాలు జరిపారు. శ్రీ కామరాజ్ ఏ.ఐ.సి. అధ్యక్షులకు ఈ విషయంలో ఆదేశాలు జారీ చేశారు కూడా.

రాష్ట్రపతి పదవికి పోటీ తీవ్రంగా వుంటుంది. జాకీర్‌హుసేన్ ముస్లిం కాబట్టి ఆయనను ఎన్నుకోవాలని ప్రధాని చేసిన వ్యాఖ్యకు కాంగ్రెసు పార్టీ ప్రచార మివ్వదు. రాష్ట్రపతికి అవసరమైన గుణగణాలన్నీ ఆయనలో వున్నవి. కాబట్టే ఆయనను ఎన్నుకోవాలి.

ఢిల్లీ డైరీ
—శ్రీ దుర్గాదాస్

దేశంలో సెక్యులరిజం తీవ్రమై పోతున్నదన్న ప్రచారం కొన్ని వర్గాలలో సాగుతున్నది. జాకీర్ హుస్సేన్ రాష్ట్రపతిగా ఎన్నికైతే, రాష్ట్రపతి ముస్లిం, విదేశాంగమంత్రి ముస్లిం (దాగ్లా) 1958 ఫిబ్రవరినాటికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ముస్లిం (శ్రీ హిదయతుల్లా) కాగలరని వీరు అంటున్నారు. ఈ ఆరోపణకు సమాధాన మేమంటే, వీరిందరు ముస్లిం లుకావడంవల్లనే ఆ పదవులలో లేరని, వారి సీనియారిటీ ప్రతిభా విశేషాలవల్ల ఆ పదవులను అలంకరించారని మాత్రమే. సెక్యులరిజం అంటే ఉన్నత పదవులలోవున్న వారిని మతదృష్టితో చూడ్డం కాదు.

నిజానికి, శ్రీ జాకీర్ హుస్సేన్, శ్రీ కోకా సుబ్బారావు లిద్దరు అన్నదమ్ములే. ఆ పదవికి పోటీ జరగడంలో తప్పులేదు.

రాష్ట్రపతి రాజ్యాంగానికి భాష్యం చెప్పనక్కరలేదు. రాష్ట్రపతి అధికారం విషయంలో నెహ్రూ, రాజేంద్రబాబులమధ్య జరిగినవివాదం పునరుద్ధరించబడితే అప్పుడు సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని తీసుకొనవలసి వుంటుంది. కాంగ్రెసు, ప్రతిపక్షాలు కలిసి రాష్ట్రపతి, గవర్నర్‌ల అధికారాలను నిర్వచించాలి.

ద్వంద్వాధికారాలు

ఇక, కేంద్రం, రాష్ట్రాల సంబంధాలకు మిక్కిలి ప్రాధాన్యం వుంది. వాస్తవమేమంటే, ఈ విషయంలో రాజకీయాధికారం రాష్ట్రాలకు వుండగా, ఆర్థికాధికారం కేంద్రం చేతిలో వుంటుంది. తన రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిని, కార్మికుల స్థితిగతులను కేంద్రానికి తెలియజేయడానికి బెంగాల్ ప్రభుత్వం నిరాకరించడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ధనం లేనిదే రాష్ట్రాలు ఏమీ చేయలేవు. అవినీతి నిర్మూలన విషయంలోను, పరిపాలనా సామర్థ్యంలోను ఇప్పుడు కాంగ్రెసు ప్రభుత్వాలకు, కాంగ్రెసేతర ప్రభుత్వాలకు మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. కేంద్రం, రాష్ట్రాల సంబంధాలకు ఆహార, ఆర్థిక సమస్యలు పరీక్షవంటివి. ఈ సంబంధాల విషయం కేంద్రంలోని అధికార వర్గం ఉప ప్రధాని మొరార్జీకి అప్పగించినట్టు కనిపిస్తున్నది.

దేశాన్ని సమైక్యంగా వుంచ వలసిన బాధ్యత హెచ్చుగా కాంగ్రెసు పైనే వుంది. ఈ విషయాన్ని అది గుర్తించక పోతే, మొన్న ఎన్నికలలో వ్యక్తమైన విప్లవ ధోరణి కాంగ్రెసును ముంచెత్తవచ్చు.

ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య సమానత్వాన్ని అమెరికా వాంఛిస్తున్నట్టు గోచరిస్తున్నది. అధికార సమత్వ సిద్ధాంతాన్ని భారత ఉపఖండంపై విధించాలని అమెరికా భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. అంటే కశ్మీర్ సమస్య రాజకీయంగా సమసి పోయినా, అది సైనికంగా తిరిగి తలయెత్తుతున్నదన్నమాట. నిజానికి, ఈప్రకటనను అమెరికా ఇదివరకే చేసి వుండేది. అయితే అప్పుడు ప్రధాని పదవిలో శ్రీమతి ఇందిరా గాంధి చేస్తున్న ప్రయత్నాలను బలహీన పరచడం ఇష్టంలేక ఆ ప్రకటనను అమెరికా అప్పుడు చేయలేదు.

మురార్జీ ప్రకటన

మొన్న గురువారంనాడు ఇండో-సోవియట్ మిత్రత్వాన్ని గురించి శ్రీ మొరార్జీ దేశాయి చేసిన ప్రకటన విమర్శకు గురి అవుతున్నది. పాకిస్తాన్ మెహర్బాని కోసం వాషింగ్టన్, మాస్కోలు రెండు పోటా పోటీలు పడుతున్నాయి. చైనా నుంచి పాకిస్తాన్‌ను వేరుచేయడం తమ లక్ష్యమని ఈ రెండు దేశాలు చెబుతున్నాయి. కాని, ఈ ప్రయత్నంలో అవి ఇండియాను విస్మరించేస్తున్నాయి. అందువల్ల, ఇండియా తన కాళ్ళపై తాను నిలబడ్డం నేర్చుకోవాలి.

ఇండో-జపనీస్ మైత్రివరకే ఇటీవల ఇండో-ఆస్ట్రేలియన్ మైత్రికూడా ప్రవర్ధమానం కావడం సంతోషదాయకం. చైనాకువ్యతిరేకంగా ఇండియా ఆస్ట్రేలియా, జపాన్‌లు సమైక్యంగా వ్యవహరించడం ఆసియా భద్రతకు తోడ్పడగలదు. అయితే హిందూ మహాసముద్రంలో బ్రిటన్ నిర్మించదలచిన సైనిక స్థావరాలు ఆసియా భద్రతకు తోడ్పడగలవన్న ఆస్ట్రేలియా అభిప్రాయాన్ని ఇండియా అమోదించడంలేదు. హిందూ మహాసముద్రంలో ఇప్పటికి వున్న అమెరికా షష్ఠమ నౌకాదళం, పోలారిస్ జలాంతర్గాములు ఆసియా భద్రతకు సరిపోతాయి. ఆసియాలో అధికార సమత్వాన్ని నెలకొల్పదలచుకుంటే, ఆస్ట్రేలియా స్వతంత్రంగా ఆలోచించుకోవడం అలవరచుకోవాలి.

ఢిల్లీలో ఉథాంట్ ప్రసంగాలు వియత్నామ్ సమస్య వల్ల ఇండియా ఆందోళనను అధికం చేశాయి. వియత్నామ్‌లో అమెరికా సైన్యాలకు బదులుగా సమితి సేనలు వుండడానికి దోహదం చేసే రాధాకృష్ణన్ పథకం ఈ సమస్యా పరిష్కారానికి దక్కుగా తోడ్పడుతుంది.

కిందటివారం ఢిల్లీలో ఉథాంట్‌కు "నెహ్రూ అవార్డు" యిచ్చినపుడు కనిపించిన వాతావరణం అలాంటి సమయంలో వుండవలసిందిగాలేదు. అది మామూలు సమావేశాలవలెనే జరిగింది. భద్రతాకాశకు చెందిన ఉద్యోగులు సభను ఆక్రమించుకొనడం వల్ల నలుగురు రాయబారులు, ఒక విదేశాంగ కార్యదర్శి గోడలకు చేరగిరి నిలబడవలసి వచ్చింది. చిరస్మరణీయంగా చెప్పుకోదగిన వాతావరణం ఈ సభలో కనిపించలేదు.

కుమార్తెకు స్టాలిన్ వ్రాసిన లేఖలు — కొన్ని విశేషాలు

ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో తలదాచుకుంటున్న స్వెట్లానా స్టాలిన్ తన తండ్రి స్వయంగా తనకు వ్రాసిన మూడు ఉత్తరాలను విడుదల చేసింది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామానికిముందు ఒక ప్రక్క తన ప్రత్యర్థులను వేలాదిమందిని కనిమ సంగుతూ వున్న సమయంలోనే వాత్సల్యం పుట్టివడే ఈ లేఖలను ఆ కమ్యూనిస్టు నియంత తన కుమార్తెకు వ్రాయడం విశేషం. ఈలేఖలన్నింటిలోను కుమార్తెపట్ల స్టాలిన్‌కుకల ప్రేమానురాగాలు వ్యక్తమవుతాయి.

ఈ లేఖను స్వెట్లానా తన ఫ్రెంచిమిత్రుడైన ఇమన్యూయల్ ఆస్టియార్‌కు అందజేసింది. వీటి ద్వారా ఆమెకు డబ్బు సంపాదించడానికి ఈ ఫ్రెంచి ప్రచురణకర్త యత్నిస్తున్నాడు.

1932 లో తనతల్లి నాడియా అల్లిలుయేవా ఆత్మహత్య చేసుకున్నప్పటి నుంచి గృహ నాయకత్వం స్వెట్లానాకే నిర్దిష్టమైనట్టు ఈ లేఖలవల్ల స్పష్టమౌతున్నది. స్వెట్లానాకు తాను కార్యదర్శినని, "తండ్రి"నని స్టాలిన్ ఒక లేఖలో చెప్పుకున్నాడు.

ఒక ప్రక్క నిర్మ వాత్సల్యం పుట్టిపడుతూ 1934-39 మధ్య ఆయన ఈ మాటలను వ్రాస్తున్న సమయంలోనే తన ప్రత్యర్థులను పెక్కుమందిని యమపురికి పంపాడంటే నమ్మడం కష్టమే. అలా వధింపబడిన వారిలో స్వెట్లానా మిత్రులు కూడా పెక్కుమంది వున్నారు.

ఈ లేఖలు వ్రాస్తున్న సమయంలో తాను ఉత్సాహంగాను, కులాసాగాను వున్నట్టు స్టాలిన్ వ్రాశాడు. అయితే, 1936 లో హిట్లర్‌తో సంప్రతింపులు జరుపుతున్నప్పుడు మాత్రం తాను తీరికలేకుండా వున్నట్టు ఆయన పేర్కొన్నాడు.

ప్రస్తుతం స్వెట్లానా వుంటున్న ఇంటిలో గృహ పరిచారకులుతప్ప మరెవ్వరు లేరు. ఆమెస్థానాలలోని మేధావులెవ్వరు మాట్లాడడానికి ఆమెకు లభించలేదు. ఈ సంగతో ఆమె "పీపా" కాలపరిమితి పూర్తి అవుతుంది.

ఆమెకు రాజకీయాలంటే యిష్టం లేదు. కేవలం పత్రికలలో ప్రముఖంగావడి, పేద సంపాదించుకోడానికి ఆమె రష్యా నుంచి రాలేదు. ఆమె తన కష్టాలపట్ల సానుభూతిని అర్థించి రష్యా నుంచి వచ్చింది.

ఇండియాలో నివసించాలని స్వెట్లానా కోర్కె. కాని, రష్యాతో తన సంబంధాలకు భంగం కలుగుతుందని అందుకు ఇండియా యిష్టగించడంలేదు. ఆమెకు ఆశ్రయమివ్వడానికి పాశ్చాత్య రాష్ట్రాలకు కూడా ఇదే అభ్యంతరం వుండవచ్చు.

తన తండ్రికి సంబంధించిన ఫొటోలను కూడా కొన్నింటిని స్వెట్లానా ఫ్రెంచి ప్రచురణ కర్తకు అందచేసింది.

ఈ లేఖలు స్టాలిన్ స్వహస్తాలతో వున్నందున వాటిని కొనివేయాలని పాశ్చాత్య దేశాల ప్రచురణ కర్తలు ఎగబడుతున్నారు.

ముఖ్యంగా పెక్కుమంది అమెరికన్ ప్రచురణ కర్తలు ముందుకు వస్తున్నారు. అయితే, ఇవి అమెరికన్ ప్రచురణ కర్తల చేతులలో పడకుండా చేయాలని, వాటిపై స్వెట్లానాకు ఎక్కువ సొమ్ము లభించి, అది ఆమె భావి జీవనాధారం కావడానికి తోడ్పడాలని ఫ్రెంచి ప్రచురణ కర్త ప్రయత్నిస్తున్నాడు.

మొత్తం మీద ఈ లేఖలపై స్వెట్లానాకు కొన్ని లక్షల రూపాయలు లభించవచ్చు. (నా ఫెన్)

వార్తలలోనివ్యక్తి

రాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థి

శ్రీ కోకా సుబ్బారావు

రాష్ట్రపతి పదవికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ కోకా సుబ్బారావు ప్రతిపక్షాల అభ్యర్థి కాగలరని ఎవ్వరూ భావించలేదు. తన అభ్యర్థిత్వానికి ఆయన అంగీకరించగలరనికూడా చాలామంది అనుకోలేదు. ఒక రాజకీయ నాయకుడు ఈ పదవికి ప్రతిపక్షాలఅభ్యర్థిగా పోటీచేస్తే దానికి అంత పెద్దప్రాముఖ్యం వచ్చివుండేది కాదు. కాని, సాక్షాత్తు సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ తన పదవికి రాజీనామాచేసి రాష్ట్రపతి పదవికి-ప్రతిపక్షాల అభ్యర్థిగా-పోటీ చేయాలని నిర్ణయించడం వల్ల ఈ ఎన్నికకు విశేషమైన ప్రాముఖ్యం కలిగింది. మొన్న ఆయన రాజీనామా చేసి వుండకపోయినా, మరి మూడు నెలలలో ఎలాగూ ఆయన రిటైరు కావలసివుంది.

శ్రీ సుబ్బారావు 1902 జూలై 15వ తేదీన జన్మించారు. ఆయన రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలోను, మద్రాసు "లా" కాలేజీలోను విద్యాభ్యాసం చేశారు. మద్రాసు హైకోర్టులో ఆయన 1926 నుంచి 1948 వరకు న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు.

1948లో శ్రీ సుబ్బారావు మద్రాసు హైకోర్టు జడ్జిగా నియమించబడ్డారు. 1954 లో గుంటూరులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు దానికి శ్రీ సుబ్బారావు చీఫ్ జస్టిస్ అయినారు.

అప్పుడు ఆయన కుటుంబం "చీఫ్ జస్టిస్ల కుటుంబం" అన్నారు. ఆయన మామగారు శ్రీ పాకాల వెంకట రమణరావు మైసూర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ పదవిని నిర్వహించారు. ఆయన బావగారు శ్రీ పాకాల వెంకట రాజమన్నార్ మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం శ్రీ సుబ్బారావు హైదరాబాద్ తరలివెళ్ళిన హైకోర్టులోపాటు చీఫ్ జస్టిసుగా అక్కడకు వెళ్ళారు. 1958 లో ఆయన సుప్రీంకోర్టు జడ్జిగా నియమింపబడ్డం ఆయన జీవితంలో ఒక మైలురాయి. కిందటి సంవత్సరమే ఆయన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమింపబడ్డారు.

శ్రీ సుబ్బారావు న్యాయశాస్త్ర వేత్త. పండితుడు. మేధావి. ఆయన లేఖిని నుంచి వెలువడిన అనేక తీర్పులలో ఆయన పాండిత్య ప్రతిభ కూడా గోచరమవుతుంది.

న్యాయమూర్తికి అవసరమైన నిర్భీకత్వం, నిష్పాక్షికత్వం, స్వతంత్రాలోచన ఆయన తీర్పులలో కనిపిస్తాయి. విదేశాలలో వర్యటన చేయడం ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని ఒక పౌరుడు విదేశాలలో వర్యటించడం. వర్యటించలేక పోవడం అనేవి ప్రభుత్వ దయాదాక్షిణ్యాలకు లోనుకావడం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ఆయన మొన్న రాజీనామా చేసేముందు చెప్పిన తీర్పే ఇందుకు నిదర్శనం.

శ్రీ సుబ్బారావు వయస్సు 65 సంవత్సరాలు.

—టి

పెత్తందారు



"దర్జాకు చిహ్నం"

జనవాక్యం

చేనేతరంగంలో సంక్షోభంపట్ల ఉపేక్షాభావం

ఆంధ్ర ప్రదేశ్‌లో చేనేతపరిశ్రమ స్థితి ప్రోత్సాహకరంగాలేదు. లక్షలకొలది రూపాయల విలువగల చేనేత వస్త్రం సొసైటీలలోను మాస్టర్ వీవర వద్ద నిల్వవున్నది. ముడి పదార్థాల ధరలు పెరిగిన కారణంగా ఉత్పత్తి ధరను తగ్గించడానికి చేనేత వస్త్రోత్పత్తి దారులు పారిశ్రామికులకు ఇచ్చే మజూరీలను తగ్గించారు.

ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగివున్న ఈ తరుణంలో పారిశ్రామికుల మజూరీలు తగ్గిపోవడంవల్ల నిరపేదలైన చేనేత పారిశ్రామికులు తమకు వచ్చే రక్షువ మజూరీలతో కుటుంబపోషణ జరగక అర్థాకలితో జీవితాలను వెళ్ళబుచ్చుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించి చేనేత పరిశ్రమకు కావలసిన ముడి పదార్థాలను సరసమైన ధరలకు అందేటట్టు చేసి ఈ పరిశ్రమకుశాశ్వతమైన రక్షణ కల్పిస్తేనే చేనేత పరిశ్రమ పారిశ్రామికుడు క్షేమంగావుండడానికి వీలవుతుంది. లేకుంటే చేనేత ప్రజల బ్రతుకు నానా అవస్థల పాలవుతుంది.

సుమారు 30 సంవత్సరాలకు పైనుంచి చేనేత పరిశ్రమకు మిల్లు పోటీ నుంచి రక్షణ కావలెనని చేనేత ప్రజానీకమంతా ఎలుగెత్తి చాటుతున్నది. ఫలితం లేదు.

శాశ్వతిక సహాయం కొరకు ఎన్ని ప్రణాళికలు వేసినా, ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా వృథా అవడమే తప్ప ఏమీ ప్రయోజనం లేదు.

ప్రస్తుతం చేనేత రంగంలో

"ఆసియాలో ఏ ఒక్క దేశపు సైనిక బలాధిక్యత పెరగకుండా చూచే హక్కు ఇతరులకు లేదు"

పాకిస్తాన్‌కు అమెరికా మారణాయుధాల సరఫరా పునరుద్ధరణపై విదేశాంగ కార్యదర్శి రూస్క్ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—

ఆసియాలో వివిధ దేశాల మధ్య బలాబలాలను సంతులితం చేసే హక్కు ఇతర దేశాలకు ఉన్నదనే విషయాన్ని భారత దేశం గుర్తించదని ఇండియా విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ పి ఎన్ ధూ నిన్న ఇక్కడ అన్నారు.

శ్రీ ధూ కయిరోకు బయలుదేరే సందర్భంలో విలేకరులతో మాట్లాడుతూ పై విధంగా అన్నారు. ఆయన రోమ్, ఏథెన్స్, టెల్‌అవీవ్, న్యూయార్క్ మొదలైన అనేక ప్రముఖ నగరాలను కూడా సందర్శిస్తారు.

పాకిస్తానుకు అమెరికా మారణాయుధాల విరిగాలను సరఫరా చేయడంపై వ్యాఖ్యానిస్తూ ఆసియాలో బలాబలాల సమతులనకు తాను అయుధాలు సరఫరా చేస్తున్నట్టు చెప్పడం విశాలమైన సిద్ధాంతం అని శ్రీ ధూ అభివర్ణించారు బలాబలాల సంతులత అప్రాంతాలలోని దేశాల మధ్యసర్వదేశ సంబంధాల మీద ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. ఈ బలాబలాల మొగ్గు ఎటుచూసాలో నిర్ణయించేహక్కుతనకుఉన్నదని ఎవరైనా చెంతే అది అత్యంత అసాధారణ విషయమని ఆయన అన్నారు. దీనిని మనం అంగీకరించమని ఆయన అన్నారు.

అమెరికాలో తయారైన సైనిక సామగ్రిని మూడోదేశం పాకిస్తాన్‌కు అమ్మడానికి అమెరికా అంగీకరించిందా అనే విషయాన్ని స్పష్టం చేయవలసిందిగా ఇండియా ప్రభుత్వం అమెరికాను కోరిందని ఆయన అన్నారు. ఒకవేళ అమెరికా ఇందుకుసమ్మతించినప్పటికీ అమెరికా ఆయుధసహాయం పొందిన అనేక దేశాలనుంచి పాకిస్తాన్ ఆయుధాలు సేకరించే అవకాశంఉంటుంది. దీనికి అమెరికా ఇంకా సమాధానంపంపించలేదని శ్రీ ధూ అన్నారు.

ఇటువంటి పరిస్థితిని ఇండియా సమచిత్తంతో చూడడానికి వీలులేదని ఆయన అన్నారు.

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం చైనానుంచి పాకిస్తాన్‌ను వేరుచేయడానికి ఉద్దేశించబడినదనే విషయాన్ని 'ఆధారరహితమైనదిగా' శ్రీ ధూ నిరాకరించారు.

అమెరికా అయుధ సహాయం ముమ్మరంగా అందుతున్న రోజులలోనే చైనా పాకిస్తాన్‌ల మధ్య గట్టి సంబంధాలు ఏర్పడ్డాయని విదేశాంగకార్యదర్శి అన్నారు.

ఇండియా, పాకిస్తాన్‌ల నడుమ అమెరికకు గల శ్రద్ధను తాము గుర్తించామని అమెరికా ఇస్తున్న సహాయం ఉభయదేశాల రక్షణ వ్యయం పెరగడంవల్ల నిరుపయోగంకాకూడదని అయన అన్నారు.

అమెరికా తన అయుధాలను తన ఇష్టమొచ్చిన దేశానికి అమ్ముకోవచ్చు. ఆ హక్కు దానికి ఉన్నమాట నిజమే. కాని గతంలో జరిగిన సంఘటనలదృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అమెరికాదృష్టిలో రాజకీయ వివేకం లేదు మాత్రం శ్రీ ధూ అన్నారు. ఈ విషయాన్ని ఇండియా అమెరికాకు స్పష్టం చేయడంతోపాటు, తన విచారాన్నికూడ వ్యక్తం చేసినట్టు శ్రీ ధూ చెప్పారు.

ఇండియా, పాకిస్తాన్‌లమధ్య సత్సంబంధాలు నెలకొనడానికి సంప్రతింపులుకుగల అవకాశాన్ని గురించి ప్రశ్నించగా ఆ విషయం పాకిస్తాన్‌మీద ఆధారపడి వున్నదని భారత దేశానికి సంబంధించినంతవరకు ఏమీ వున్నా లేకపోయినా సంప్రతింపులు కొనసాగాలని భావిస్తున్నట్టు శ్రీ ధూ చెప్పారు.

భూటాన్‌తో తపాలా సౌకర్యాలకు చెందిన ఒప్పందాలు

న్యూఢిల్లీకి ప్రతినిధివర్గం రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18— భూటాన్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ టోగార్ నాయకత్వాన సలుగురు సభ్యులు కలిగిన భూటాన్ ప్రతినిధి వర్గం ఒకటి నగరానికి చేరుకొన్నది. రిజిస్టర్‌తోపాటు, తపాలామరియు అర్థమంపకానికి సంబంధించిన రెండు పోస్టల్ ఒప్పందాలపై సంతకాలు చేయడానికి వీరు ఇక్కడికి వచ్చారు.

ఏప్రిల్ 21 తేదీన ఈ ఒప్పందాలపై సంతకాలు జరుగుతవి.

భూటాన్ ద్వితీయ పంచవర్ష ప్రణాళిక వివరాలను గురించి చర్చించడానికి ఇండియా ప్రతినిధివర్గం వచ్చేనెలలో భూటాన్ వెళ్ళవచ్చు.

పుదుచ్చేరి అసెంబ్లీ వ్యవహారాల సలహా సంఘం తీర్మానం లేకుండ బడ్జెట్టు సాధారణ చర్చకు ఉపక్రమించినందుకు నిరసనగా ప్రతిపక్షమైన యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ సభ్యులు ఏప్రిల్ 17 వ తేదీన సభ నుంచి వాకౌట్ చేశారు.

స్వర్గీయ నిజాం వారసునినిర్బంధంలో ప్రభుత్వం ఒత్తిడి

రాకుమారి షహజాదీ పాషా ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 18— తనకు వారసుడుగా జ్యేష్ఠపుత్రుడు బేరార్ రాకుమారుని కాదని, తన మనుమని ఎన్నిక చేయడంలో స్వర్గీయ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మీద ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని హైదరాబాద్ మాజీ పాలకుని కుమార్తె రాకుమారి షహజాదీ పాషా ఆరోపించారు.

తనతండ్రి బేరార్ రాకుమారుడు అజమ్‌జాఖాన్‌ను అమితంగా ప్రేమించేవారని, సాధారణ పరిస్థితిలో ఆయననే తన వారసునిగా ప్రకటించి వుండెడి వారని, బేరార్ రాకుమారుడు అనేబిరుదు పొందడానికి బ్రిటిష్ వారితో ఆ రోజులలో స్వర్గీయ నిజాం సల్పిన పోరాటం ఆయనకుగల ప్రేమకు నిదర్శనమని అమె తెలియజేశారు.

రాకుమారి ఒక పెద్ద హోటల్‌కు విన్న పత్రికా ప్రతినిధులను ఆహ్వానించి కొత్త నిజాం, తన మేనల్లుడు అయిన మీర్ బర్కత్ అలీఖాన్ పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. నిజాం కుటుంబానికి చెందిన శ్రీలు పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడడం ఇదే మొదటిసారి.

కింగ్ కోఠి ప్రాసాదం నుంచి తనను బయటకు పంపివేశారని అమె కొత్త నిజాంపై ఆరోపించారు.

తనగదికి విద్యుచ్ఛక్తి, నీటిసరఫరాలను కూడా నిలిపివేసినందున తాను ఒకవారం రోజులుగా రాజప్రాసాదానికి చెందిన ఒక అధికారి ఇంటిలో వుంటున్నట్టు రాకుమారి చెప్పారు.

తనకు లభించవలసిన కనీస మర్యాదలను కూడా నిరాకరించి జీవితాన్ని దుర్భరం చేశారని అమె వివరించారు. కనీసం పట్టాభిషేక మహోత్సవానికి కూడా తనను ఆహ్వానించలేదని అమె వెల్లడించారు.

55 సంవత్సరాల వయస్సుగల షహజాదీ పాషా ఇస్లాం సిద్ధాంతం ప్రకారం తనకు రావలసిన తన తండ్రి ఆస్తిలోని వాటాను రాబట్టుకొనడానికి ప్రధాని ఇందిరాగాంధీ సౌకర్యాన్ని కోరగలనని వెల్లడించారు. పాషా అవివాహిత.

తండ్రికి జీవిత పర్యంతం సేవ చేయడానికి ఆయన వద్దనే వుండిపోవడానికి తాను వివాహం చేసుకొనరాదని శిక్షయించుకొన్నట్టు షహజాదీ వివరించారు.

ఇష్టమొచ్చిన ఎవరో ఒకరిని వివాహం చేసుకోవలసిందిగా తన తండ్రి తనను బలవంత పెట్టారని. ఒకసారి కొట్టడం కూడా జరిగిందని అమె తెలియజేశారు.

తన తండ్రి తనపై ఆధారపడిన వారి కోసం ట్రస్టులను ఏర్పాటుచేసిన సంగతి తెలిసినప్పటికి, వీటినామా వ్రాసింది లేనిది తనకు తెలియదని అమె చెప్పారు.

తాను కొత్త నిజాం నుంచి నెలకు 5000 రూపాయల భత్యం పొందుతున్నాననిఅయితే అభరణాలతో సహా తన తండ్రి ఆస్తిలో తనకు వాటా రావలసివున్నదని అమె అన్నారు.

నగల విలువ ఎంత వుండేది అమె అంచనా వేయలేక పోయారు. స్వర్గీయ నిజాం అభరణాలు, మణులు నజబ్‌బాగ్‌లో వున్నట్టు అమె వెల్లడించారు.

ఎవరినైనా కలుసుకొనడానికి బయటకు రావడం తనకు ఇదే మొదటి సారని పత్రికలలో వచ్చే అనేకం తప్పు వార్తలదృష్ట్యా తాను ఈ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేయవలసివచ్చిందని రాకుమారి వివరించారు.

అమె స్లాక్సు ధరించి, సిగరెట్లు కాలుస్తూ పత్రికా ప్రతినిధుల సమావేశానికి వచ్చారు. వరదా కూడా ధరించలేదు.

విజయవాడలో శ్రీ కొత్త రఘురామయ్యకు జరిగిన సన్మాన సభలో ఉపన్యసిస్తున్న శ్రీ కె ఎల్ ఎన్ ప్రసాద్‌ను, ఆయన పక్క సభాధ్యక్షులు శ్రీ మద్ది సుదర్శనం, శ్రీ పచ్చిపులుసు వెంకట సుబ్బారావు ప్రభృతులను చూడవచ్చు

విఫలమై పోయిన ఢిల్లీ పోలీసుల సమ్మె

-డ్యూటీకి తిరిగి హెచ్చుమంది రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—

సమ్మె సాగించిన ఢిల్లీ పోలీసులు తిరిగి ఆఫీసులకు హాజరు కావడం నేడు మరింత మెరుగైనట్టు అధికారులు తెలియజేశారు.

నిన్న ఢిల్లీ పోలీసు కార్యాలయాలకు 99 శాతం పోలీసులు హాజరయినట్టు పాత్రికులకు విదితమే.

ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తమ అదుపులోవున్నదని, అయితే నగరంలో ఇంకా మామూలు పరిస్థితి నెలకొన లేదని పోలీసు డిప్యూటీ కమిషనర్ శ్రీ టాండన్ తెలియజేశారు.

ఢిల్లీ పోలీసుల సమ్మె పరిష్కారానికి త్రిసూత్ర పథకం

పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎస్. ఎమ్. బెనర్జీ సూచన

న్యూఢిల్లీ ఏప్రిల్ 18— ఢిల్లీలో పోలీసుల సమ్మె పరిష్కారానికి తాను కేంద్ర హోంమంత్రికి త్రిసూత్ర పథకాన్ని సూచించినట్టు పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎస్. ఎం. బెనర్జీ నిన్న రాత్రి పత్రికలవారికి తెలిపారు.

శ్రీ బెనర్జీ ఈ క్రింది మూడు సూత్రాలను ప్రతిపాదించారు.

1. అరెస్టు చేయబడిన పోలీసులను వెంటనే విడుదలచేసి, వారినుంచి ఎటువంటి క్షమాపణ పత్రం కోరకుండా డ్యూటీలో చేర్చుకొనాలి.

2. పోలీసుల డిస్మిసల్స్, డిసార్డెన్ గురించి సానుభూతిలో పునఃపరిశీలన జరగాలి.

3. పోలీసుల సమస్యల గురించి చర్చించడానికి ఢిల్లీ పోలీసు కర్మచారి సంఘం నాయకులను హోంమంత్రి కలుసుకొనాలి.

పోలీసుల ప్రతినిధి వర్గాన్ని కలుసుకొనే విషయమై నేటి సాయంత్రం లోగా తనకు తెలియజేయగలనని హోం మంత్రి హామీనిచ్చినట్టు శ్రీ బెనర్జీ చెప్పారు.

ఈ త్రిసూత్ర పథకాన్ని ప్రభుత్వం అంగీకరించిందని పక్షంలో పోలీసుల సమ్మె కొనసాగ గలదని శ్రీ బెనర్జీ పత్రికల వారికి తెలిపారు. ఢిల్లీలోని వివిధ ట్రేడ్ యూనియన్లు లోగడ ప్రకటించిన ప్రకారం 22 వ తేదీన సానుభూతి సమ్మె చేయగలరని కూడా అయన చెప్పారు.

డాక్టర్ లోహియా విజ్ఞప్తి

పోలీసుల సమ్మెకు సానుభూతిగా 22 వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనవలసిందిగా ఢిల్లీ ప్రజలకు ఎస్. ఎస్. పి. నాయకుడు డాక్టర్ రామమనోహర్ లోహియా నిన్న విజ్ఞప్తి చేశారు.

పోలీసుల పట్ల ప్రభుత్వం వహించిన కఠినతో కూడిన వైఖరిని వ్యతిరేకించాలని ప్రజలకు డాక్టర్ లోహియా విజ్ఞప్తి చేశారు.

పోలీసు సమ్మె ప్రభావం దేశవ్యాప్తంగా వుండని పక్షంలో తాను ఢిల్లీ పోలీసుల వ్యవహారంలో తల దూర్చవుండేవాడిని కాదని డాక్టర్ లోహియా పత్రికల వారికి తెలిపారు.

శ్రీ ఎస్. జి. గోరే విజ్ఞప్తి

ఢిల్లీ పోలీసులకు సానుభూతిగా ఢిల్లీలో సార్వత్రిక సమ్మె జరిపే విషయమై తమ వర్గయాన్ని పునః పరిశోధించ వలసిందిగా ఎస్. ఎస్. పి. మితవాద కమ్యూనిస్టుపార్టీ అతివాద కమ్యూనిస్టుపార్టీల నాయకులకు ప్రజాసోషలిస్టు పార్టీ చైర్మన్ శ్రీ ఎస్. జి గోరే విజ్ఞప్తిచేశారు.

బీహారు మంత్రితో చర్చలకు హోం మంత్రి తిరస్కృతి

బీహారు పోలీసు శాఖమంత్రి శ్రీ రామానంద తివారి కూడా నిన్న మధ్యాహ్నం హోం మంత్రి శ్రీ చావన్‌ను కలుసుకొని పరిస్థితిని గురించి చర్చించారు.

ఢిల్లీ పోలీసులకు సంబంధించిన సమస్యలను గురించి శ్రీ రామానంద తివారీతో చర్చించడానికి శ్రీ చావన్ నిరాకరించినట్టు తెలుస్తున్నది.

శ్రీ తివారి ఉదయం బీహార్‌నుంచి ఇక్కడకు చేరుకొనగానే శ్రీ చావన్‌తో ఇంటర్వ్యూను కోరినట్టు తెలుస్తున్నది.

అయితే ఢిల్లీ పోలీసుల సమస్యలగురించి చర్చించడం తనకిష్టంలేనట్టు శ్రీ చావన్ స్పష్టం చేశారు.

ఢిల్లీ పోలీసుల ఆందోళనలో బీహారు రాష్ట్రం ప్రమేయమేమీ అవసరంలేదనికూడా అయన స్పష్టం చేశారట.

బీహారుకు సంబంధించిన సమస్యలను గురించి చర్చించడానికి సంసిద్ధతను శ్రీ చావన్ వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది.

తరువాత బీహారు మంత్రి శ్రీ తివారి హోం మంత్రిని అయన నివాసంలో కలుసుకున్నారు. అయితే అప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వమే ఈ సమస్యను తనంతటతాను పరిష్కరించుకొనాలని అభిలషిస్తున్నట్టు శ్రీ చావన్ స్పష్టం చేశారు.

గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పోలీసుల సాధక బాధకాలను గురించి స్థూలంగా చర్చలు జరిగాయని తెలుస్తున్నది.

పోలీసుల న్యాయపైన కోర్కెల పట్ల ప్రభుత్వానికి పూర్తి సానుభూతి వున్నదని, అయితే పోలీసులలో క్రమశిక్షణా రాహిత్య ధర్మలను ప్రభుత్వం సహించకూడదని శ్రీ చావన్ వివరం చేశారు.

శ్రీ తివారి నేటి ఉదయం తిరిగి పాట్నా వెళ్ళనున్నారు.

స్వెట్లానా తిరిగి ఇండియా సందర్శించే అవకాశం

అలహాబాద్ స్నేహితునికి వ్రాసిన లేఖలో వివరణ

అలహాబాద్, ఏప్రిల్ 18 — స్టాలిన్ కుమార్తె మదాం స్వెట్లానా తాను తిరిగి ఇండియా సందర్శించాలనే కోర్కెను వెలిబుచ్చింది. అయితే ఈసారి రష్యా పౌరసత్వంతో కాకుండా, మరొక దేశ పౌరసత్వంతో ఇక్కడకు రావాలని అమె భావిస్తున్నది.

స్విట్జర్‌లాండ్ నుంచి ఏప్రిల్ అరవ తేదీన అలహాబాద్‌లోని మిత్రుడొకరికి వ్రాసిన లేఖలో తాను ఇప్పుడు భారత ప్రభుత్వాన్నిగాని, మరెవరినిగాని ఇండియాలో ఆశ్రయం ఇవ్వవలసిందిగా కోరదలచలేదని మదాం స్వెట్లానా చెప్పింది. ఇప్పటికి తాను రష్యా పాస్ పోర్టులోనే ఉండడాన సోవియట్ యూనియన్‌కు ఎలుకబడి గల దేశంలో తనకు భద్రత ఉన్నట్టు భావించడం లేదని అమె తెలియ జేసింది.

ఇండియా పార్లమెంటులో సోషలిస్టు నాయకుడు డాక్టరు రామమనోహర్ లోహియా లేవదీసిన చర్చను తాను చదివానని, ఈ చర్చ సందర్భంలో తనను గురించి వాస్తవాలు బయటికి వచ్చినందుకు సంతోషంగా ఉన్నదని అమె ఆ లేఖలో తెలియజేసింది. వాస్తవాలను భయపడడం మంచిది కాదని అమె అన్నారు.

ప్రస్తుతం తానొక పథకాన్ని పరిశీలించుకొని విదేశాలలో ఉంటున్నానని ఆపథకం పూర్తికాగానే తాను ఇండియాకు రాగలనని స్వెట్లానా తెలియ చేసింది.

సుభదా రూపై విద్యార్థుల దాడి: తలకు గట్టి దెబ్బలు

వారణాసీయ సంస్కృత విశ్వవిద్యాలయ లైబ్రరియన్

వారణాసి, ఏప్రిల్ 18— వారణాసీయ సంస్కృత విశ్వవిద్యాలయం లైబ్రరియన్ డాక్టరీ సుభదాయూపీన కొందరు యూనివర్శిటీ విద్యార్థులు గతశనివారం కర్రలతో దాడిచేసి కొట్టిన ఫలితంగా తలకుబలమైన గాయాలుతగిలాయి. చికిత్స నిమిత్తం ఆయనను ఆసుపత్రిలో చేర్చారు.

యూనివర్శిటీలో గత రెండు మాసాల నుంచి ఉద్యోగులపై దాడి చేయడం, కొట్టడం లాంటి ఘటనలు అరడజను సార్లకు పైగా జరిగాయి.

సమాచారం అందిగానే సీనియర్ పోలీసు సూపరింటెండెంట్, సిటీమేజిస్ట్రేటు కొంత మంది జవానులతో ఘటనా స్థలానికి వెళ్ళారు.

ఇందుకు సంబంధించిన దర్యాప్తు జరుగుతున్నది. ఎటువంటి అరెస్టు జరగలేదు.

శ్రీ ధూకు చికిత్స చేస్తున్న డాక్టర్లు అందజేసిన సమాచారం ప్రకారం ఆయన సంతృప్తికరంగా కోలుకుంటున్నారని తెలుస్తున్నది.

ఈ నెల 26వ తేదీన ప్రారంభం కావలసిన యూనివర్శిటి పరీక్షలు వాయిదా వేయబడ్డాయి.

యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. ఎన్. శాస్త్రి గృహాన్ని సాయుధ పోలీసులు కాపలా కాస్తున్నారు.

గత రెండు మాసాలుగా కొందరు విద్యార్థులు కొన్ని కోర్కెలను పురస్కరించుకొని ఆందోళన సాగిస్తున్నారు.

బీహారు సంక్షేమ నిధికి పదివేల విరాళం

దక్షిణ మధ్య రైల్వే మహిళా మండలిచే

హైదరాబాద్, ఏప్రిల్ 18— దక్షిణ మధ్య రైల్వే మహిళామండలి బీహారు కరువు నిధికి పదివేల రూపాయలు పంపించింది.

మొన్న సికిందరాబాద్‌లో 12 వ రైల్వే వారోత్సవం జరిగిన సందర్భంలో మహిళా మండలి కార్యదర్శిని శ్రీమతి రామమోహన రాయ్ ఈ ప్రకటన చేశారు.

పశ్చిమ జర్మనీలో పారిశ్రామిక ప్రదర్శన

మద్రాసు, ఏప్రిల్ 18— పశ్చిమ జర్మనీలోని హానోవర్‌లో ఏప్రిల్ 29 వ తేదీ నుంచి మే ఏడవ తేదీ వరకు పారిశ్రామిక ప్రదర్శన జరుగుతుంది.

ఈ ప్రదర్శనలో అయిదు వేలమంది ప్రదర్శకులు పాల్గొంటారని భావించబడుతున్నది. వీరిలో 970 మంది విదేశీయులుండవచ్చునని అనుకుంటున్నారు.

4, 200,000 చదరపు అడుగుల ఖాళీ స్థలంలో ఈ ప్రదర్శనను ఏర్పాటుచేస్తున్నారు.

ఈ ప్రదర్శనలో పాల్గొనే 28 విదేశాలలో ఫ్రెంచి, ఆస్ట్రియా, స్విట్జర్‌లాండ్, ఇటలీలు వున్నాయి.

ముఖ్యమైన పారిశ్రామిక సంస్థలుఅనేకం ఈ సంవత్సరం పాల్గొంటాయి

ఈ హానోవర్ ప్రదర్శనా సమయంలో అనేక సాంకేతిక సమావేశాలు జరుగుతాయి.

హానోవర్ ప్రదర్శనను గురించిన ఇతర వివరాలను ఇండియాలోని అజంతా ఎడ్వర్టైజింగ్ బొంబాయి, కలకత్తా, మద్రాసు, న్యూఢిల్లీ శాఖలో నుంచి పొందవచ్చును.

రామచంద్రపురం మునిసిపాలిటీ

చిట్ టెండరు నోటీసు

ROC నెం. 457/67 - సి 2 తేది 14.4.1967

ఈ కింది తెలిపిన పనికై రామచంద్రపురం మునిసిపల్ కార్యాలయంలో 4.5.1967 వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు రామచంద్రపురం మునిసిపాలిటీ పురపాలక సంఘ కార్యదర్శిచే సీల్డు టెండర్లు పిలిచబడును. అదే రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకు రామచంద్రపురం మునిసిపల్ కార్యదర్శిచే గాని లేదా అయన ప్రతినిధిచే ఆ టెండర్లు తెరవబడును. తగిన అదాయం పన్ను అధికారుల నుంచి ఇన్‌కంటాక్సు క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను పొంది దానిని టెండర్‌తో జతపరచవలెను. 27.4.67 వ తేదీ నుంచి 3.5.67 వ తేదీ వరకు (టెండరు రోజులు కలుపుకొని) ఆఫీసు పనిచేసే ఏ రోజునయినను పనికి ఎదురుగా తెలిపిన టెండరు షెడ్యూల్ రేటును చెల్లించి రామచంద్రపురం మునిసిపల్ ఆఫీసు మేనేజరు నుంచి టెండరు డాక్యుమెంట్లను పొందవచ్చును.

పనిపేరు	టెండరు షెడ్యూల్ ఖరీదు	ఎర్నెస్టు మనీ డిపాజిట్టు	కంట్రాక్టు స్వభావం	పూర్తిచేయు వలసిన కాలం
మునిసిపల్ మార్కెట్‌లో మార్కెట్‌స్టాల్స్ నిర్మాణానికి	రు 30/-	4940/-	లంప్‌సమ్	12 నెలలు

(సం) ఆర్. రామారావు,
కార్యదర్శి.

సాలంపాలెం గ్రామ పంచాయతీ

టెండరు నోటీసు

ఈ దిగువ సదహరించిన పనులు చేయుటకు సాలంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయములో ది 25-4-1967 సాయంత్రం 3 గంటల వరకు సీలు వేసిన టెండర్లు యీ దిగువ సంతకము చేసిన వారిచే స్వీకరింపబడును. సదరు టెండర్లు అదే రోజున సాయంత్రం 4 గంటలకు హాజరైన టెండరుదారు సమక్షమున తెరువబడును

నెం	పని వివరము	ఎస్టిమేటు	కాలపరిమితి	ధరావతు
		రు		రు
1.	6 ఎ నాన్తు ఛానల్ మీద o/s పరాంగు వద్ద స్లాబ్ కల్వర్టు నిర్మించుట	3200-00	3 నెలలు	160-00
2.	సాలంపాలెంలో ధరం చెరువునకు సాలి పేట వైపునకు మెట్లు కట్టుట	2700-00	3 నెలలు	135-00
3.	సాలంపాలెంలో బందిలి దొడ్డి నిర్మించుటకు	3000-00	3 నెలలు	150-00
4	పంచాయతీ ఏరియాలో మట్టిపనులు చేయుటకు	10,500-00	1 నెల	530-00
5.	పంచాయతీ ఏరియాలోని చెరువులకు మట్టిపనులు చేయుటకు	2600-00	1 నెల	130-0-
6.	పంచాయతీ ఏరియాలో మంచినీరు దావులు నిర్మాణం చేయుటకు	1000-00	1 నెల	50.00
7.	6 ఎ నాన్తుఛానల్ దగ్గర 2" డయామీటరు గల Tube well పంపువేయుటకు	200-00	1 నెల	10-00

షరా :— చనులు వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలుసుకొనవచ్చును.

(సం) బాలసుందరరావు,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

వర్గీకృత ప్రకటనలు

ప్రకటన

అమర్తలూరు పంచాయతి

అమర్తలూరు పంచాయతి సమితిలో ఈ దిగువ సదహరించిన భాళీలను భర్తీ చేయుటకు "ఎ" క్లాసు రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్లు వద్దనుండి 25-4-67 తేదీలోగా అప్లికేషన్లు కోరడమైనది.

1. తురుమెళ్ళ — 1
2. దోనేపూడి — 1

పబ్లిక్ నెలకి రు 120/- (వేతన 12-4-67 (సం) కె. విరసింగ్,
బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు.

పేరు మార్పు

ఇదివరకు రమేష్ క్లాత్ స్టోర్సు, ప్రొ॥ గుడ్ల చినసత్యన్నారాయణ ఎట్టలబ్యాపారము 31-3-67 తేదీ వరకు జరిగించియున్నారు. పదరు సొంత వ్యాపారము ఆ తేదీ లగాయతు మానివేసి 1-4-67 లగాయతు రమేష్ క్లాత్ స్టోర్సు, పొప్రైటర్స్ :- మెసర్స్ గుడ్ల చిన సత్యన్నారాయణ అండ్ బ్రదర్స్, అన పేరుతో గుడ్ల చినసత్యన్నారాయణగారు, గుడ్ల నాగభూషణరావు గుడ్ల బలరామస్వామిగార్లు పార్టనర్‌షిప్ పద్ధతిగా పదరు వ్యాపారము చేయుచున్నారు. గాన తమరు ఇకముందట మాతో పూర్వము మాదిరిగానే పై పద్ధతితో వ్యాపారము నడిపించగలందులకు 31-3-67 వర్కి గుడ్ల చినసత్యన్నారాయణ పేర బిల్లియున్న రావలసిన, ఇవ్వవలసిన బాకీలు 1-4-67 తేదీకి పై పద్ధతి పేర బదాయింపు చేయగలందులకు కోరుచున్నాము తమకు తెలియజేయగలందులకు వ్రాయడమైనది.

చిత్తగించవలెను.

గుడ్ల చినసత్యన్నారాయణ.

టెండరు నోటీసు

ఘంటసాల గ్రామ పంచాయతి

కృష్ణాజిల్లా, దివితాలూకా, ఘంటసాల గ్రామ పంచాయతీ కార్య నిర్వాహక అధికారిచే యీ క్రింద ఉదహరించిన పనిని చేయుటకుగాను సీలువేసిన టెండర్లు ది 24.4.67వ తేదీ సాయంత్రం గం 4.0ల వర్కుకు తీసుకోబడును. ది 25-4-67వ తేదీ ఉదయం గం 10.30లకు హాజరైన టెండరుదార్ల సమక్షములో టెండరు తెరవబడును. యితర వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలుసుకొన కోరుచున్నాను.

పని వివరం :— జి. రంగయ్య యింటి వద్దనుండి జి వెంకటసుబ్బయ్య దాదాపు వరకు మెటలు రోడ్డు వేయుట. ఎస్టిమేటు మొత్తం. రు 38 000/—

డి పాజిటు రు 1900/.

(సం) ఎ శంకరరావు.
15-4-67 కార్యనిర్వాహక అధికారి.

విజయవాడ అయోధ్యనగర్‌లో వరదకట్టకు శంకుస్థాపన సందర్భంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి డాక్టర్ కె. ఎల్ రావును, ఆయనప్రక్క రాష్ట్రమంత్రి శ్రీ సిద్దారెడ్డి, శాసనసభ్యులు శ్రీ మరుపిళ్ళ చిట్టి, శ్రీమతి కస్తూరిలను చూడవచ్చు

చైనాలో ఒక ఉన్నత సైనికాధికారి తొలగింపు

లియూను, అనుచరులను విచారించి మరణశిక్షను విధించాలని కోరుతూ పోస్టర్లు

టోక్యో, ఏప్రిల్ 18

చైనా ప్రజా విమోచన సైన్యంలో సాంస్కృతిక విప్లవ వర్గం అధినేత సూ-సియాంగ్-చియన్ పదవీచ్యుతుడైనట్టు నిన్న పీకింగ్ నుంచి జపనీస్ విలేకరి తెలియజేశారు.

జపనీస్ జాతీయ వార్తా సంస్థ "కోడో" ప్రతినిధి తన వార్తకు ఆధారంగా ఒకవాల్ పోస్టరును ఉదహరిస్తూ, చైర్మన్ మావో తలపెట్టిన సాంస్కృతిక విప్లవంలో జాప్యానికి అతడే బాధ్యుడని అరోపించినట్టు పేర్కొన్నారు.

ఈ మేరకు మావో సతీమణి చియాంగ్ చింగ్ మొదలు ఒకప్రకటన చేసినట్టు పోస్టర్ తెలుపుతున్నది.

సైన్యంలో సాంస్కృతిక విప్లవానికి ఇకముందు సియావో హా, యాంగ్‌చెంగ్ పులు నాయకత్వం వహించనున్నారు. వీరిద్దరు సైనిక సాంస్కృతిక విప్లవవర్గం ఉపప్రధానాధికారులుగా వున్నారు. ప్రజాభద్రత శాఖమంత్రి సియావూ-బిహ్ కూడా సాంస్కృతిక విప్లవానికి సారథ్యం వహిస్తారు.

లియూపై అరోపణలు

పీకింగ్, ఏప్రిల్ 18- చైర్మన్ మావోను కూలద్రోసి, సైనిక విప్లవంద్వారా సార్వభౌమాధికారాన్ని హస్తగతం చేసికొనడానికి ప్రెసిడెంట్ లియూ షావ్-చీ పదవీ భ్రష్టుడైన పీకింగ్ మేయర్ పెంగ్‌చెన్‌తో కలిసి పెక్కు సంవత్సరాలుగా కుట్ర పన్ని చైనా వార్తా సంస్థ పేర్కొన్నది.

తొలుత లియూ షావో-చీ అంటే భయ పడినట్టుగా వున్నట్టు ఇక్కడ అభిజ్ఞవర్గాలు తెలియజేశాయి.

అనంతరగల విచారాన్ని పార్టీ కేంద్ర సంఘం ముందు పెట్టడానికి మావో సంకల్పించినట్టు ఈ వర్గాలు వెల్లడించాయి.

1956 లో పార్టీ కేంద్ర సంఘానికి ఎన్నికైన మొత్తం 88 మంది సభ్యులలో 48 మంది మావోను వ్యతిరేకిస్తున్నట్టు కమ్యూనిస్టువ్యవహారాల ప్రసిద్ధిగాంచిన ఒకరు తెలియజేసినట్టు కొమింటాంగ్ చైనా వార్తా సంస్థ పేర్కొన్నది.

ఢిల్లీ పోలీసుల సమ్మె పరిష్కారానికి త్రిసూత్ర పథకం

పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎస్. ఎమ్. బెనర్జీ సూచన

న్యూఢిల్లీ ఏప్రిల్ 18— ఢిల్లీలో పోలీసుల సమ్మె పరిష్కారానికి తాను కేంద్ర హోంమంత్రికి త్రిసూత్ర పథకాన్ని సూచించినట్టు పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎస్. ఎం. బెనర్జీ నిన్న రాత్రి పత్రికలవారికి తెలిపారు.

శ్రీ బెనర్జీ ఈ క్రింది మూడు సూత్రాలను ప్రతిపాదించారు.

1. అరెస్టు చేయబడిన పోలీసులను వెంటనే విడుదలచేసి, వారినుంచి ఎటువంటి క్షమాపణ పత్రం కోరకుండా డ్యూటీలో చేర్చుకొనాలి.

2. పోలీసుల డిస్మిసల్స్, డిసార్డెన్ గురించి సానుభూతిలో పునఃపరిశీలన జరగాలి.

3. పోలీసుల సమస్యల గురించి చర్చించడానికి ఢిల్లీ పోలీసు కర్మచారి సంఘం నాయకులను హోంమంత్రి కలుసుకొనాలి.

పోలీసుల ప్రతినిధి వర్గాన్ని కలుసుకొనే విషయమై నేటి సాయంత్రం లోగా తనకు తెలియజేయగలనని హోం మంత్రి హామీనిచ్చినట్టు శ్రీ బెనర్జీ చెప్పారు.

ఈ త్రిసూత్ర పథకాన్ని ప్రభుత్వం

ఇండియా ఎగుమతులను పెంచడానికి ప్రయత్నం

కొన్ని నిర్బంధాలను ప్రవేశపెట్టడానికి భారత ప్రభుత్వం యోచనచేస్తున్నదట

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18—

ఎగుమతులకు ధన సహాయంచేసే విధానంవల్ల ఆశించిన ఫలితాలు చేకూరని కారణంగా, కేంద్ర ప్రభుత్వం దేశం నుంచి ఎగుమతులు పెంచే దృష్టితో కొంతమేరకు నిర్బంధ ప్రాతిపదికపై ఎగుమతులు చేయాలనే ప్రతిపాదన విషయమై పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది.

నిర్బంధం విధించే సమస్య ఇంకా ప్రాథమిక దశలోనే వున్నది. ఈ నెల 21, 22 తేదీలలో ఇక్కడ జరుగనున్న ఎగుమతి, దిగుమతుల వలహామండలి సమావేశంలో ఈ విషయమై వాణిజ్యమంత్రి శ్రీ దినేష్‌సింగ్ కొన్ని వివరాలు ప్రకటించవచ్చునని భావిస్తున్నారు.

ప్రభుత్వం అదిలో కొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తులలో కొంత భాగాన్ని ఎగుమతి చేయాలని నిర్బంధాలను విధించాలని భావించింది

అయితే వివిధ పరిశ్రమలు పాటించవలసిన నంతవరకు ఎగుమతులు చేయగలవని హామీ నివ్వడం వల్ల ఈ అభిప్రాయాన్ని విరమించడం జరిగింది.

దేశం ఎగుమతులను అభివృద్ధి పరచడానికి నిర్బంధ విధానాన్ని ప్రవేశపెట్టడం అవసరమని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి.

ఎగుమతుల ద్వారా ఏదో మారకాన్ని తగు మేరకు సంపాదించలేని పక్షంలో ఇండియా చెల్లింపవలసి వచ్చే దిగుమతుల బిల్లు భరింపలేనంత కాగలదని కూడా విరుద్ధాభిప్రాయపడుతున్నారు.

చతుర్థ ప్రణాళికా కాలంలో ఎగుమతుల విషయంలో ప్రభుత్వ విధానాన్ని గురించి వివరించే ఎగుమతుల విధానం తీర్మానాన్ని మే 22 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టవచ్చునని భావిస్తున్నారు.

గత జూన్‌లో రూపాయి విలువను తగ్గించినప్పటికీ, ఇండియా ఎగుమతులు వృద్ధిచెందలేదు, అంతేకాక విదేశీమారకం ఆర్జనలోనేకాక, సాధారణంగా మనదేశం నుంచి పంపే తేయాకు, నార, జౌళి వంటి వాటి ఎగుమతులు కూడా తగ్గిపోయాయి.

1966-67లో ఎగుమతుల తడుగుదల చాలా తీవ్రమైనదని, ఇలాటి ఈ దశలో నిర్బంధాన్ని ప్రవేశపెట్టే విషయమై ప్రతిపాదనలు యోచిస్తున్నారు.

కేవలం జనవరి ఎగుమతులలోనే 1966 లో 30 కోట్ల రూపాయలకుపైగా నష్టం వచ్చింది.

ఎగుమతులు పడిపోవడానికి అనేక కారణాలు చెబుతున్నారు. పాకిస్తాన్‌తో పోటీ, ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల, ఎగుమతి పన్నులు అధికంగా వుండడం మొదలైనవి కొన్ని.

దేశంలో నార ఉత్పత్తి తగ్గిపోవడానికి ముఖ్య కారణం దుర్భిక్ష పరిస్థితులు. ఇండియాకు పాకిస్తాన్‌తో వాణిజ్య సంబంధాలు లేవు కారణంగా కావలసిన మేరకు నారను దిగుమతి చేసుకొనలేక పోతున్నది.

తేయాకు ఎగుమతులలోకూడా ఇండియా 197 కోట్ల రూపాయలు నష్టపడింది. 1966 లో తేయాకు ఎగుమతులు 95.3 కోట్ల రూపాయలు విలువగల 1698 లక్షల కిలోగ్రాముల మేరకు జరిగాయి.

1965 లో రూపాయి విలువ తగ్గింపుకు ముందు రు 115 కోట్ల విలువగల 1994 లక్షల కిలోగ్రాముల మేరకు తేయాకు ఎగుమతి అయింది.

రూపాయి విలువ తగ్గింపుతో ఏర్పడిన అస్థిర పరిస్థితులు, రెండేళ్లుగా వస్తున్న దుర్భిక్ష పరిస్థితులు ఎగుమతుల తగ్గుదలకు కారణమని అధికార వర్గాలవారు అంటున్నారు.

అయితే వాణిజ్య వర్గాలలో ఎగుమతి పరమలపై పిడిస్తున్న ఎక్కువ సుంకం కూడా కారణమనే భావన వున్నది.

జనపనార ఉత్పత్తులు, తేయాకువంటి వాటిపై ఎగుమతి సుంకాలను తగ్గించాలని భారత వాణిజ్య సమాఖ్య తేయాకు, నార పరిశ్రమలవారు మన్చించారు.

ఎగుమతి సుంకాల తగ్గింపు ఏదైనా జరిగే పక్షంలో ఎగుమతి దిగుమతుల సలహా సంఘం సమావేశం సందర్భంలో గాని, మే 29వ తేదీ ఆర్థిక మంత్రి సాధారణ బడ్జెట్టును ప్రవేశపెట్టే సమయంలో గాని ప్రకటన వెలువడవచ్చునని భావించబడుతున్నది.

"కళాభారతి"

హైదరాబాద్‌లో కొత్త సాంస్కృతికసంస్థ ఏర్పాటు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 18— ఆకాశవాణి రిటైర్డ్ డైరెక్టరు డాక్టర్ ఎ. వీరభద్రరావు గత శుక్రవారం నాడు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఒక సాంస్కృతిక సంస్థ "కళాభారతి"కి ప్రారంభోత్సవం చేశారు. శ్రీ పి. ఎల్. శివరాం అధ్యక్షత వహించారు.

శ్రీ శివరాం స్వాగతం చెప్పుతూ సంస్థ లక్ష్యాలను, ఆశయాలను వివరించారు. ప్రతి నెలా ఒక సాంస్కృతిక కార్యక్రమం వుంటుందని ఆయన చెప్పారు.

శ్రీ వీరభద్రరావు తమ ప్రసంగంలో సాంఘిక జీవనంలో కళల ప్రాముఖ్యాన్ని వివరించారు.

శ్రీ పి. కృష్ణమూర్తి తమ నివేదికలో ఇంతవరకు 129 మంది సభ్యులు వున్నారు. 1967 సంవత్సరంలో కనీసం 500 మంది వరకు సభ్యులను చేర్చుకొనగలమని ఆశాభావం వెలిబుచ్చారు.

విద్వాన్ కుమారి బి. లలిత, బి. హరిప్రియల శాస్త్రీయ సంగీత కార్యక్రమం జరిగింది. శ్రీ మల్లికార్జునశర్మ (వయొలిన్) ఎస్. వి. రామం (మృదంగం), జియా ఉల్‌హసన్ (సితార్), నందకుమార్ (తబల) కూడా పాల్గొన్నారు.

"కళాభారతి" సభ్యులు ఎన్ రాజేశ్వరరావు పి. శేఖరరావు, అయ్యదేవర పురుషోత్తమరావులు శ్రీకృష్ణ రాయబారం నుంచి కొన్ని భాగాలను నటించారు. ఎన్. హనుమంతరావు హార్మోనియం వాయించారు. పి. కృష్ణమూర్తి వందన సమర్పణ చేశారు.

బ్లాక్ మార్కెట్‌లో ఆహార ధాన్యాల అమ్మకం

వనపర్తిలో ముగ్గురు వ్యాపారుల పట్టివేత

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

మహబూబ్‌నగర్ ఏప్రిల్ 18— బియ్యం, జొన్న లను బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్మినందుకుగాను వనపర్తిలో బి. రామనాథం, పి. బాలకిష్టయ్య, కె రాములు అను ముగ్గురు వ్యాపారులను అరెస్టు చేశారు.

ప్రత్యేక నెర విచారణ విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. రాధాకృష్ణమూర్తి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ వనపర్తిలో బ్లాక్ మార్కెట్‌లో ఆహారధాన్యాలను అమ్ముతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని. మాటువేసి తాము ఈ ముగ్గురు వ్యాపారులను పట్టుకొన్నామని తెలిపారు. వనపర్తి పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు నమోదు అయినవి. వనపర్తి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ కేసులను గురించి దర్యాప్తు చేస్తున్నారు.

వనపర్తి ప్రభుత్వ లియ్యం మిలు నుంచి ఆహారధాన్యాలతో వెడుతున్న రెండెడ్ల బస్సు రెండింటిని ప్రత్యేక నేర విచారణ విభాగం వారు పట్టుకున్నారు.

(1 వ పేజీ తరువాయి)

బోర్డు వ్యాపారసంస్థ వంటిదని అన్నారు. బోర్డు ఇప్పటి వరకు రు. 240 కోట్ల వరకు పెట్టుబడి పెట్టింది. సిబ్బంది తగ్గింపు విద్యుచ్ఛక్తి రేటు హెచ్చింపువల్ల బోర్డు ఆదాయ వ్యయాలు సరిసమానం కాగలవని 1969 నుంచి బోర్డు నష్టంలేని ప్రాతిపదికపై పని చేయగలదని ఆయన ఆశించారు.

లక్ష పరిశ్రమల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాలకన్నా విద్యుచ్ఛక్తి రేటు అధికమని ఇతర రాష్ట్రాల పారిశ్రామిక వేత్తల పోటీకి తాము తట్టుకోలేక పోతున్నామని తమ ఉత్పత్తి వ్యయంలో పది శాతం విద్యుచ్ఛక్తి బిల్లు క్రింద పోతున్నదని తెలిపారు.

డాక్టర్ కె. ఎల్. రావు చిన్న పరిశ్రమకి వారికై యూనిట్‌కు నాలుగు పైసలు తగ్గించే అవకాశం ఉందేమో చూడవలసినదని రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు చైర్మన్‌కు సూచించారు.

శ్రీ సి. నరసింహం పరిశ్రమలవారు రాత్రి 10 నుంచి ఉదయం 6 లోగా విద్యుచ్ఛక్తిని వాడుకొంటే యూనిట్ రేటును కొంత తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు.

ఆదాయాలపై గరిష్ఠ పరిమితి: మురార్జీ వైముఖ్యం

బొంబాయి, ఏప్రిల్ 18— ఆదాయాల మీద ఎటువంటి గరిష్ఠ పరిమితిని విధించకూడదని, అటువంటి చర్య ప్రజలను ఉత్పత్తి కార్యక్రమాలలో తమశక్తులను కేంద్రీకరించడానికి ప్రోత్సహించదని ఇండియా ఉపప్రధానమంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ నిన్న ఇక్కడ అన్నారు.

నిన్న ఇక్కడ జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసమానత్వం పుట్టుకతోనే వస్తుందని శ్రీ మురార్జీ అంగీకరిస్తూ మన ప్రయత్నమంతా దానిని తొలగించడానికే నని ఆయన అన్నారు.

దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభావితం కాని చర్యలు తీసుకోడానికి కూడా తాను సంకోచించనని ఆయన అన్నారు.

కాంగ్రెసు విచ్ఛిన్నమౌతున్నదనే విషయం తాను అంగీకరించనని ఆర్థికమంత్రి అన్నారు.

బొంబాయి జర్నలిస్టుల యూనియన్ ఏర్పాటు చేసిన పత్రికా "గాష్టి"లో మాట్లాడుతూ శ్రీ మురార్జీ పై విధంగా అన్నారు.

దేశాన్ని ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, పోలీసు సమ్మె, మధ్యపాన నిషేధం మొదలైన అనేక సమస్యలపై శ్రీ దేశాయ్ తమ అభిప్రాయాలను వ్యక్తపరచారు.

కాంగ్రెసు విచ్ఛిత్తిని ప్రస్తావించి ఇది కొందరి "ఆకాంక్ష" మాత్రమేనని ఆయన అన్నారు. అయితే భవిష్యత్తులో కాంగ్రెసు విచ్ఛిత్తి కాదని తాను చెప్పాలనుకున్నారు, ప్రతిఎన్నికలనుంచి చాలామంది కాంగ్రెసులో చేరవచ్చునని ఆయన అన్నారు.

ఇండియాలో అధిక పన్నులు వున్నాయనే విషయాన్ని ఆయన అంగీకరించలేదు. కొన్ని దేశాలలో జాతీయ ఆదాయంలో 25 శాతం మేరకు పన్ను లున్నాయని, ఇండియాలో 14 శాతం మేరకే వున్నాయని ఆయన అన్నారు.

దక్షిణ వియత్నాం ఉత్తర ప్రాంతంలో యుద్ధ ప్రజ్వలన

17 మంది కమ్యూనిస్టుల మృతి

సైగాన్, ఏప్రిల్ 18—

దక్షిణ వియత్నాంలోని ఉత్తర ప్రాంతంలో అమెరికా పై మానిన ఉనికికి చెందిన సేనలకు, ఉత్తర వియత్నాం బలాలకు మధ్య నిన్న పెక్కుసార్లు సంఘర్షణలు జరిగినట్టు ఇక్కడ అధికార పూర్వకంగా తెలియపచ్చింది.

అమెరికా పైమానికదళానికి చెందిన సేనలు దక్షిణవియత్నాం ఉత్తరప్రాంతంలో యుద్ధదర్యలను సాగించడం ఇదే ప్రథమమని ఇక్కడ సైనికాధికారి తెలియజేశారు.

ఉభయసేనల మధ్య జరిగిన పోరాటంలో 17 మంది కమ్యూనిస్టులు విహతులైనారు. హెలికాప్టర్ విమానాల దాడులలో మరి 22 మంది కమ్యూనిస్టులు మరణించారు.

అమెరికన్ సైనికులలో ముగ్గురు మరణించినట్టు, ఏడుగురు గాయపడినట్టు సైనిక ప్రతినిధి చెప్పారు.

అడ్మిరల్ షార్ప్ జోస్యం

వాషింగ్టన్, ఏప్రిల్ 18— దక్షిణ వియత్నాం ఉత్తర రాష్ట్రాలలో ఉత్తర వియత్నాం సేనలు పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించే సూచనలు కనపడ్తున్నవని పసిఫిక్ ప్రాంతంలో అమెరికా సైనిక ప్రధానాధికారి అడ్మిరల్ ఎస్. జి. షార్ప్ నిన్న తెలియచేశారు.

వియత్కాంగ్ దాడులలో 16 మంది పౌరుల మృతి

దక్షిణ వియత్నాంలో మొన్న స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగినప్పుడు వియత్కాంగ్ దళాలు జరిపిన దాడులలో 16 మంది పౌరులు మరణించినట్టు నిన్న ఇక్కడ అధికారులు తెలియజేశారు.

అమెరికాపై సోవియెట్ ఆరోపణ

న్యూయార్క్, ఏప్రిల్ 18— వియత్నాంలో యుద్ధాన్ని విస్తరించవలసే ఉద్దేశం వున్నందున ఐక్యరాజ్య సమితిలో దూరతమణను నిర్వచించడానికి తిరిగి ప్రయత్నించడానికి అమెరికా వ్యతిరేకిస్తున్నదని నిన్న సోవియెట్ యూనియన్ ఆరోపించింది.

సోవియెట్ ప్రతినిధి శ్రీ వాసికోవ్‌స్కీ ఐక్యరాజ్య సమితి ఉపసంఘం సమావేశంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్య చేశారు.

అస్సాం మెయిల్ ప్రమాదంలో ఎనిమిదిమందికి గాయాలు

గౌహతి, ఏప్రిల్ 18 —

నౌలుగు డౌన్ అస్సాం మెయిల్‌కు సంభవించిన ప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు.

ఇరువురు తీవ్రంగాను, ఆరుగురు స్వల్పంగాను గాయపడ్డారు.

రైలింగ్ ఇంజన్, దానివెనుక వరుసగా వున్న ఆరు బోగీలు పట్టాలు తప్పడంతో అస్సాం మెయిల్ ప్రమాదానికి లోనయింది.

ఎన్. ఎఫ్ రైల్వేలోని లుమ్డింగ్ సెక్షన్‌లోని లారిసఖంగ్, హబాయ్‌పూర్ స్టేషన్ల మధ్య ఈ ప్రమాదం సంభవించినదని అధికారిక్యాసే రిక్కడ ప్రకటించారు.

రైల్వే డాక్టర్‌లు, ఉన్నతాధికారులతో ఒక మెడికల్ వ్యాన్ ప్రమాదస్థలానికి హుటాహుటిన వెళ్ళింది.

ప్రమాద కారణాలను గురించి దర్యాప్తు జరుగుతున్నది.

గాయపడిన వారినందరను లుమ్డింగ్ రైల్వే ఆసుపత్రిలో చేర్చారు.

రోడ్ల అభివృద్ధికి రు. 195 వేలు

తుని మునిసిపాలిటీ బడ్జెట్టులో కేటాయింపు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

తుని, ఏప్రిల్ 18— పట్టణంలో రోడ్ల నిర్మాణానికి ఈ నేటి మునిసిపల్ బడ్జెట్టులో రు. 195 వేలను కేటాయించారు.

తుని మునిసిపాలిటీ 1967-68 ఆదాయ వ్యయ పట్టికలో ప్రారంభనిల్వ మూడులక్షల తొంబదివేలు. రానున్న ఆదాయం ఆరు లక్షల ఇరవై మూడువేలు. ఖర్చు పెట్టదల చేశారు.

ఇందులో కౌన్సిల్ హాలు, బ్రాడ్వారు కొనడానికి బజారులో కొట్లు కట్టడానికి లక్ష ఇరవై అయిదు వేలు ఖర్చుపెట్ట నున్నారు.

ఈ సంవత్సరం మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయడానికి పట్టణాన్ని సర్వే చేసి సొమ్ము ఏడు లక్షల అరవై తొమ్మిది వేలుగా చూపారు.

తూర్పు పాకిస్తాన్‌లో తుపాను బీభత్సం

50 మంది మృతి, వందమందికి గాయాలు, పెక్కు ఇండ్లు నేలమట్టం

ఢాక్కా, (తూర్పు పాకిస్తాన్) ఏప్రిల్ 18. తూర్పు పాకిస్తాన్‌లోని మదరిపూర ప్రాంతంలోనున్న తుపాను తాకిడికి కనీసం 50 మంది ప్రజలు చనిపోయారు. మరి 100 మంది గాయపడినట్టు నిన్న రాత్రి ఇక్కడకు అందిన వార్తలబట్టి తెలుస్తున్నది

తుపాను ఉధృతికు లోనయిన టెలిగ్రాఫ్, టెలిఫోన్ స్తంభాలు కూలిపోయాయి పెక్కు చోట్ల వృక్షాలు సయితం సమూలంగా పెకిలి వచ్చాయి. పెక్కు ఇండ్లు ధ్వంసమయినట్టు కూడా తెలుస్తున్నది.

తుపాను వల్ల ఆ ప్రాంతంలో వార్తా సౌకర్యాలు పూర్తిగా స్తంభించినట్టు అధికార వర్గాల వారు తెలిపారు.

అస్సాం, నాగభూమి సరిహద్దు సమస్య

ఇదివరలోనే నిర్దేశింపబడినట్టు అభిజ్ఞుల వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18— అస్సాం, నాగభూమి మధ్య సరిహద్దులను నిర్ణయించడానికి సరిహద్దు నిర్ణాయక సంఘాన్ని ఏర్పాటు చేయాలనే నాగభూమి చేసిన ప్రతిపాదన ఇక్కడి అభిజ్ఞ వర్గాలలో ఆదరణ పొందలేక పోతున్నది.

1925 లోను, పిమ్మట 1963 లోను కూడా నాగభూమి సరిహద్దును స్పష్టంగా చెప్పారనడం జరిగిందని వారు అంటున్నారు.

రాష్ట్ర ప్రజారోగ్య, అనుపత్రి ఉద్యోగుల సంఘం

హైదరాబాద్, ఏప్రిల్ 18— ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్యం, అనుపత్రి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా శ్రీ నవాబ్‌ఖాన్ ఎన్నికయ్యారు శ్రీయుతులు మహమ్మద్ గౌస్, ఎం.ఎ. రషీద్‌లు ఉపాధ్యక్షులుగాను, నాగరాజ్ ప్రసాద్ ప్రధాన కార్యదర్శి గాను ఎన్నికయ్యారు.

బీహారుకు ఇతోధిక సహాయం

సోవియెట్ యూనియన్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి

పాట్నా, ఏప్రిల్ 17— దురదృష్టవశాత్తు లోనయిన బీహారు రాష్ట్రానికి పెద్ద ఎత్తున సహాయాన్ని అందించవలసినదిగా సోవియెట్ యూనియన్‌కు బీహారు ముఖ్యమంత్రి శ్రీ మహామాయ ప్రసాద్‌సిన్హా నిన్న విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని అయిదుకోట్ల ప్రజలలో నాలుగుకోట్ల మంది ఆహారం, నీరు లేక మలమల మాడుతున్నట్టు ఆయన వివరించారు.

బీహార్ రాష్ట్రం ఇండో సోవియెట్ సాంస్కృతిక సంఘం నిర్వహించిన సోవియెట్ పుస్తకాలు, వర్ణచిత్రాల ప్రదర్శనను ప్రారంభిస్తూ, బీహార్ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఆహార సంక్షోభం ప్రమాదంలోని అన్ని దేశాల సహాయం అవసరమైనంతగా విస్తృత స్వరూపం కలిగివున్నదని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీ పోలీసుల సమ్మె

నూటికి 99 మంది డ్యూటీలకు హాజరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17— ఢిల్లీ పోలీసు కార్యాలయాలకు 99 శాతం పోలీసులు హాజరయినట్టు పోలీసు డిప్యూటీ కమిషనర్ శ్రీ బి. ఎన్. టాండన్ నేడు తెలియజేశారు.

ఈ సాయంత్రానికి డ్యూటీలో చేరవలసిందిగా శుక్రవారం నుంచి సమ్మె చేస్తున్న పోలీసు సిబ్బందివారికి ఢిల్లీ అధికారులు చెప్పారు.

పరిస్థితిపూర్తిగా తమ అదుపులో వున్నట్టు శ్రీ టాండన్ నేటి రాత్రి పత్రికా విలేకరులకు తెలియజేశారు.

నేడు డ్యూటీకి హాజరు కాని పోలీసుల సంఖ్య 418. ఏరుకాక 900 మంది అందుబాటులో వున్నారు, మొత్తం పోలీసు సిబ్బంది సంఖ్య 16 వేలు.

ఇంత వరకు డిస్చార్జి అయిన 232 మంది పోలీసులు శాశ్వతిక రిక్రూట్‌లు. ఇంతవరకు 18 మందిని బర్తరఫ్ చేశారు.

శ్రీ తివారి ప్రతిపాదనకు శ్రీ చవాన్ నిరాకరణ

న్యూఢిల్లీ ఏప్రిల్ 17— ప్రభుత్వం, ఢిల్లీ పోలీసుల సిబ్బందికి మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించడానికి తాను రాజీయత్నాలు చేస్తానన్న బీహార్ పోలీసుమంత్రి శ్రీ రామానందతివారి ప్రతిపాదనకు కేంద్ర హోం మంత్రి శ్రీ చవాన్ తిరస్కరించారు.

పరిస్థితిని తానే పరిష్కరిస్తానని, పోలీసు సిబ్బంది తరఫున శ్రీ తివారికాని, మరెవ్వరు కాని సంప్రతింపులు జరపవలసిన్నకర్లేదని శ్రీ చవాన్ శ్రీ తివారికి చెప్పారు.

పై విషయాలను శ్రీతివారి నేడు పత్రికా విలేకరులకు తెలియజేశారు.

ఇందిరా గాంధీతో చవాన్ భేటి

న్యూఢిల్లీ ఏప్రిల్ 17— కేంద్ర హోంమంత్రి శ్రీ చవాన్, క్యాబినెట్ సెక్రటరీ శ్రీ డి. ఎస్. జోషి, హోంశాఖ కార్యదర్శి శ్రీఎల్ పి. సింగ్, ప్రధాని సంయుక్త కార్యదర్శి శ్రీ ఎస్. బెనర్జీలు నేడు ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీని కలుసుకొని ఢిల్లీలో పోలీసు సిబ్బందిసమ్మెను గురించి, ఈ పరిస్థితిని తట్టుకోవడానికి తీసుకొన్న చర్యలనుగురించి ఆమెకు తెలియజేశారు.

తీవ్రమైన రసాయనిక ఎరువుల ఉత్పత్తిలో సమృద్ధి

వచ్చే మూడు ఏళ్ళలో సాధించవచ్చని శ్రీ కొత్త రఘురామయ్య వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) జయవాడ, ఏప్రిల్ 17—

రసాయనిక ఎరువుల ఉత్పత్తిలో రానున్న మూడు సంవత్సరాల కాలంలో భారతదేశం స్వయం సమృద్ధిని పొందగలదని కేంద్ర పెట్రోలియం, రసాయనిక శాఖ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య నేటి సాయంత్రం ఇక్కడ తెలియజేశారు

2.4 మిలియన్ టన్నుల రసాయనిక ఎరువుల ఉత్పత్తిలో 1.6 మిలియన్ టన్నుల ఎరువులు ప్రభుత్వరంగంలోను, మిగిలినది ప్రైవేటు రంగంలో ఉత్పత్తి కాగలదని కేంద్ర మంత్రి తెలియచేశారు.

శ్రీ డి. రామకృష్ణారావు అధ్యక్షతన విజయవాడ సైన్స్ మిలర్సు అసోసియేషన్ భవనంలో నేటి సాయంత్రం పార్లమెంటు సభ్యులు శ్రీ మద్ది సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కేంద్ర మంత్రి రఘురామయ్యకు సన్మానం చేశారు.

సమావేశం వేదపఠనంతో ప్రారంభమయింది.

కేంద్ర మంత్రి శ్రీ రఘురామయ్య శ్రీ మద్ది సుబ్రహ్మణ్యం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జి. ఎస్ రాజు ప్రభృతులకు నూతన వస్త్రాలు సమర్పించి సత్కరించారు.

పశ్చాధ్యక్షులు శ్రీ మదర్శనం మంత్రి రఘురామయ్యకు తమకు వున్న పరస్పర హితత్వాన్ని తెలియచేశారు.

ఆంధ్రప్రాంతం ఆర్థికంగా వెనుకబడి వున్నదని, వ్యవసాయాభివృద్ధికి రసాయనిక ఎరువుల సరఫరాలోను ఎరిశిమీద నేలకొల్పడంలోను తగు శ్రద్ధ తీసుకొనాలని శ్రీ రఘురామయ్య కోరారు.

ఛాంబర్ అధ్యక్షులు శ్రీ పచ్చిపులుసు వెంకటసుబ్బారావు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వం ఎక్కువగా పన్నులు వేసినదని వర్తకులమీద పన్నులు వేయరాదని తెలియచేశారు.

అంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ ప్రసంగిస్తూ, శ్రీ రఘురామయ్యలో తమకు కొన్ని సంవత్సరాలుగా పరిచయంకలదని అన్నారు.

రఘురామయ్యలో ఆత్మీయత, కార్యదక్షత కలవని, రాజకీయ రంగంలో అడ్డంకులు తొలగించుకుని పురోగమించగల ధీశాలి అని, ఆయనకు తోచిందే నిర్మొహమాటంగా చెప్పగల ధైర్యశాలి అని తెలియజేశారు.

ఆయన తాను మంత్రిఅనే విషయం విస్మరించి, ప్రజలతో సమ్మిళితంగా వ్యవహరిస్తారని ప్రజా సేవయే పరమావధిగా పెట్టుకొన్నారని శ్రీ ప్రసాద్ పేర్కొన్నారు.

ఏటి కాలనీకు అధ్యక్షులు శ్రీ జి యస్, రాజు మాటాడుతూ ప్రజలకు సేవ చేయడానికి శ్రీ రఘురామయ్యకు క్యాబినెట్ మంత్రి హోదా ఇవ్వాలని కోరారు.

మంత్రి ప్రసంగం

కేంద్ర మంత్రి రఘురామయ్య ప్రసంగిస్తూ, ఆహార పదార్థాల కొరతవల్ల విదేశాలనుంచి వాటిని దిగుమతి చేసుకొనవలసి వస్తోందని దానివల్ల విదేశీ మారక ద్రవ్యం కొరత ఏర్పడి, పారిశ్రామికాభివృద్ధికి ఆటంకం కలిగిందని ఆయన పేర్కొన్నారు.

దేశంలో ధరల పెరుగుదల విషయం ప్రస్తావించి ఇది తాత్కాలికమేనని, ప్రతి దేశంలోను ఇట్టి క్లిష్ట పరిస్థితి ఏర్పడిందని అన్నారు

ఎరువులు, నూనెలు, కెమికల్స్ విదేశాలనుంచి దిగుమతి చేసుకోకుండనే వుండేటట్టు చూచుకొనవలసి వుందని పెట్రోలు కనుక మనం దిగుమతి చేసుకొనవలసిన స్థితే వస్తే దుర్భరమవుతుందని అయన తెలియచేశారు.

రసాయనిక ఎరువులు ఎంతగా మన దేశంలో ఉత్పత్తి చేయగలిగితే మనదేశం అంతగా బాగుపడగలదని మూడు నాలుగు సంవత్సరాలు కష్టపడి కృషిచేస్తే ఇతర దేశాలపై ఆధార పడనక్కరలేదని అయన తెలియచేశారు.

పారిశ్రామికంగా దేశం అభివృద్ధి పొందాలంటే విదేశ మారకద్రవ్యం లభ్యంకావాలని దానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు

దేశం క్లిష్టసమస్యలు ఎదుర్కొనవలసి వస్తుందని పనులలో సహనం, ఓర్పు ఎంతైనా అవసరమని, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలోనూ సహకరిస్తుందని, పారిశ్రామికులు, వ్యాపారస్తులు, రైతులు ప్రభుత్వ కార్యక్రమాలలో సహకరిస్తే దేశం రెండుమూడు సంవత్సరాలలో అభివృద్ధిలోకి రాగలదని ఆయన తెలియచేశారు.

శ్రీ రామకృష్ణారావు వందన సమర్పణ చేశారు.

కేంద్రం నుంచి అస్సాం రాష్ట్రానికి ఆహార సహాయం

లభ్యమయ్యే అవకాశాలు లేవని ముఖ్యమంత్రి శ్రీ చాలిహా వెల్లడి

గౌహతి, ఏప్రిల్ 17 — కేంద్రం నుంచి ఎటి ఆహార సహాయం లభ్యంకాగల అవకాశాలు లేనందున అస్సాం ప్రజలు తీవ్రమైన చిక్కులను ఎదుర్కొనవలసి వుంటుందని అస్సాం ముఖ్యమంత్రి శ్రీ బి. పి. చాలిహా నిన్న పేర్కొన్నారు

ముఖ్యమంత్రుల సమావేశం సందర్భంగా ఇటీవల ఢిల్లీ వెళ్ళినప్పుడు, అస్సాం రాష్ట్రానికి గోదాము కోటా ఎక్కువ చేయాలని తాను గట్టిగా కోరినప్పటికి, మొత్తం దేశంలో ఆహార పరిస్థితి క్లిష్టంగా వున్న దృష్ట్యా కేంద్రం అందుకు అంగీకరించలేదని శ్రీ చాలిహా నిన్న పత్రికల వారికి తెలియజేశారు. రాష్ట్రానికి సహాయం చేయడంలో కేంద్ర తన అసహాయతని వ్యక్తం చేసిందని శ్రీ చాలిహా చెప్పారు.

శ్రీకమలా పతిత్రిపాఠి

యు. పి. శాసనసభకు ఎన్నిక

వారణాసి, ఏప్రిల్ 17 — జౌన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి ఉత్తర ప్రదేశ్ విధాన సభకు యు. పి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ కమలాపతిత్రిపాఠి ఎన్నికయారని నిశ్చయమయినట్టు తెలుస్తున్నది.

శ్రీ త్రిపాఠి తమ ప్రత్యర్థి ఇంగ్ బహదూర్ యాదవ్ (జనసంఘం)ను 1875 ఓట్లమెజారిటితో ఓడించారు. ఈ నియోజక వర్గం నుంచి మొత్తం పది మంది పోటీ చేశారు.

శ్రీ త్రిపాఠికి 32,752 ఓట్లు రాగా శ్రీయాదవ్‌కు 30,877 ఓట్లు వచ్చాయట.

జనసంఘ అభ్యర్థి ఎన్నిక

శ్రీ బుధ్రామ్ (జనసంఘం) బస్తి జిల్లాలోని హయా అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఎన్నికయినారు.

అయనలో పోటీ చేసిన ప్రత్యర్థి శ్రీ పుత్తిరి రామ్ (కాం) 35 వందల ఓట్ల తేడాతో ఓడి పోయాడు. ముగ్గురు అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు.

ఉమ్మడి కుటుంబం వంటిది కాంగ్రెసు: విజయవాడలో శ్రీ రఘురామయ్య ఛలోక్తి

("ఆంధ్రజ్యోతి" ప్రత్యేక ప్రతినిధి)

విజయవాడ, ఏప్రిల్ 17— కేంద్ర పెట్రోలియం, కెమికల్స్ శాఖ మంత్రి శ్రీ కె. రఘురామయ్య నేడిక్కడ రాజకీయాలను ఉమ్మడి కుటుంబ వ్యవహారాలతో పోల్చారు.

ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ తమ పిచ్చుక్త ధర్మాన్ని పాటించి పనుపడు అ కుటుంబం కీర్తిప్రతిష్ఠలతో పాటు సుఖశాంతులతో అలరారుతుందని ఆయన అన్నారు.

దేశ చరిత్రలో అత్యంత క్లిష్టదశలో ఇప్పుడు మనం వున్నామని, సహనం, వివేకం కోల్పోతే ముప్పువాటిల్లుతుందని శ్రీ రఘురామయ్య ఇక్కడొక సన్మాన సభలో మాట్లాడుతూ హెచ్చరించారు.

కాంగ్రెసు సంస్థ కూడా ఉమ్మడి కుటుంబం వంటిదని, అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం ప్రభుత్వ నిర్మాణంలోను, సంస్థ పునర్నిర్మాణంలోను లభించినప్పుడు, పరస్పర విశ్వాసం పెంపొంది, సుస్థిరత కుదురుతుందని అయన అన్నారు.

వివాదానికి ఇద్దరు అవసరం అని ఆయన చమత్కరిస్తూ, హృదయ పరివర్తనవాలని, సదవగాహన, సానుభూతి వెల్లి విరియాలని, అప్పుడే కాంగ్రెసు సంస్థ పటిష్ఠం కాగలదని

పల్లెలు:బస్తీలు

"కళారామం" వార్షికోత్సవం

బందరులో చిత్రకళా సంస్థ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

బందరు, ఏప్రిల్ 18— స్థానిక ఈదే పల్లిలో చిత్రకళా కళాశాల "కళారామం" వార్షికోత్సవం శ్రీ వి. వి. టోబీపే అధ్యక్షతన ఇటీవల జరిగినది. డాక్టరు ఎ. ఎస్. రావు జాతీయ పతాకను ఆవిష్కరించారు.

కళాశాల వ్యవస్థాపకులు శ్రీ బ్రహ్మానందం 1941 లో శ్రీ అడివి బాపిరాజు సహాయ సహకారాలతో స్థాపించి, అనేక మంది ఉత్సాహవంతులైన బొల్షాహక చిత్రకళాకారులకు విద్య బోధించి "కళారామం" కళాశాలచిత్రకళను పరివ్యాప్తం చేశారని శ్రీ టోబీపే ప్రశంసించారు.

శ్రీ బ్రహ్మానందం స్వాగతం చెప్పారు. ఎల్. ఐ. సి. పైన్ ఆర్టు ఆసోసియేషన్ అధ్యక్షులు శ్రీ లంక సుందరరామయ్య శ్రీ బ్రహ్మానందం కళాసేవలను అభినందిస్తూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారం ఈ కళాశాలకు అత్యవసర మన్నారు.

శ్రీ కాళీనాథుని నాగేశ్వరరావు 29 వ వర్ధంతి

బందరు, ఏప్రిల్ 18—దేశోద్ధారక శ్రీ కాళీనాథుని నాగేశ్వరరావు వంతులు 29 వ వర్ధంతి ఉత్సవం శ్రీ చిట్టా బాలకృష్ణశాస్త్రి మెమోరియల్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. సత్యనారాయణ చుడగ అధ్యక్షతన మొన్న జరిగినది. అలంకరించిన వంతులుగారి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

స్కూలు కరస్పాండెంటు శ్రీ యర్లగడ్డ వేంకటరావు మాట్లాడుతూ ఆంధ్రోద్యమానికి, ఆంధ్ర సంస్కృతికి, రాష్ట్ర, రాష్ట్రేతరాంధ్రులకు ఆంధ్ర భాషకు వంతులుగారి సేవలు అనన్యమైనవని వక్కాణించారు. శ్రీ ఇ. గోవిందరాజులు కూడా సభలో ఉపన్యసించారు.

లయన్స్ క్లబ్బుకు నూతన కార్యవర్గం ఎన్నిక

బందరు, ఏప్రిల్ 18— స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యుల సమావేశం శ్రీ పిన్నకోట ధర్మారావు నాయుడు అధ్యక్షతన మొన్న జరిగినది. నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా శ్రీ కమ్మిల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు మల్లాది సూరిశాస్త్రి, టి. సత్యనారాయణమూర్తి, మునుగూరి రామకృష్ణ, కార్యదర్శిగా శ్రీ పి. సూర్యనారాయణరావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీ విశ్వనాథ్ ఎనాబార్, కోశాధికారిగా శ్రీ కటేటి మాతవరావు, టైల్‌ట్విస్టరుగా శ్రీ జంగాల హరిశాతభాను, లయన్స్ టేమరుగా శ్రీ ఎ. కాయికుమార్, డైరెక్టర్లుగా శ్రీయుతులు కూరాళ్ళ రామచంద్రరావు, కె. వెంకటరావు, సి. పి బ్రహ్మం, పి.వెంకటరావు పి. రంగారావు జె. ఎస్. రామకృష్ణమూర్తి ఎన్నికయారు.

మంత్రిచే సత్రం పరిశీలన

బందరు, ఏప్రిల్ 18—స్థానిక శ్రీ వెంకటేశ్వర దర సత్రాన్ని మొన్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి శ్రీ రుద్రరాజు రామలింగరాజు పరిశీలించి, దానివిద్యార్థులకు కిళ్లీ, పీడీ, పోడా వర్తకసంఘాన్ని, బృందావనపురం మిఠాయివర్తకసంఘాన్ని, విరాళా లిచ్చిన దాతలను అభినందించారు. సత్రంపై మరొక అంతస్తును నిర్మించడానికి తిరుపతి దేవస్థానం నుంచి భూరి విరాళం ఇప్పించవలసినదిగా విజ్ఞప్తిచేయవలసినదిగా మంత్రికి శ్రీ నాయుడు నాగేశ్వరరావు సమర్పించారు. మంత్రి తప్పక ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

వేములపల్లిలో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

బందరు, ఏప్రిల్ 18— కృష్ణాజిల్లా నవ్యసమితి వేములపల్లిలో కమ్యూనిటీ హాలుకు ఇటీవల శాసనసభ్యులు శ్రీ కనుమూరి బోడేశ్వరరావు శంకుస్థాపనజరిపారు. సమితి ప్రెసిడెంట్ శ్రీ తాళా వెంకటస్వామి మాట్లాడారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్తు వైస్-చైర్మన్ శ్రీ మండలి వెంకటకృష్ణారావు దివిశాలూకా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు బి. డి. ఓ. శ్రీ బోడేశ్వరరావు హరిజనవాడలో కమ్యూనిటీ హాలు ఉపయోగం. హాస్టిల్ అవసరాలను వివరించారు. అవనిగడ్డ సమితి ప్రెసిడెంట్ శ్రీ అన్నపరెడ్డి సత్యనారాయణ, చిన కళ్ళేపల్లి, కూచివాడి, పొగోలు, లక్ష్మీపురం, మాజీ సర్పంచ్ శ్రీ సూర్యదేవర సత్యనారాయణ కూడా ఉపన్యసించినదివ సర్పంచ్ శ్రీ సూర్యదేవర భాస్కరరావు వందన సమర్పణం చేశారు.

బందరు సమితి సభ్యునిగా శ్రీ బి.వాయునందనరావు ఎన్నిక

బందరు, ఏప్రిల్ 18— మల్లేశ్వరం నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయిన శ్రీ బూరగడ్డ నిరంజనరావు స్థానంలో బందరు సమితిలో ఏర్పడు ఖాళీని పూర్తిచేయడానికి మొన్న జరిగిన పోటీలో శ్రీ బూరగడ్డ వాయునందనరావు కోఆప్షన్ సభ్యునిగా గెలుపొందారు.

ఆయనతో శ్రీ జె. వీరరాఘవులు పోటీ చేశారు. 47 మంది సభ్యులకు 41 మంది హాజరయారు

కాకినాడ, ఏప్రిల్ 18— మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వైస్-చైర్మన్ శ్రీ ఎస్. నల్లప్పరెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగినది. రెండవ పర్యాయం ఈ కిందివారిని ఏకగ్రీవంగా ఎక్జిక్యుటివ్ కమిటీకి ఎన్నుకొన్నారు:

శ్రీయుతులు ఎస్. రామమూర్తి, పి. వెంకటకృష్ణయ్య, ఎం. చిన్నుస్వామి.

ఆకివీడు : స్థానిక సబ్ పోస్టాఫీసును వెంకట్నగేడ్ ఆఫీసుగా మార్చినకారణంగా ఇక్కడినుంచి బదిలీఅయిన సబ్ పోస్టు మాస్టరు శ్రీ. పి. వి. చలం గౌరవార్థం సన్మాన సభను ఏర్పాటు చేశారు. కొత్తగా భార్జి పుచ్చుకొన్న సబ్‌పోస్టు మాస్టరు శ్రీ జి. సుబ్బారావు అధ్యక్షతన శ్రీయుతులు మారెళ్ళ కాశేశ్వరావు, జగన్నాథస్వామి శ్రీ చలం గుణగణాలను ప్రస్తుతించారు. తేనేటివిందు జరిగినది.

తరిగొప్పుల : కృష్ణాజిల్లా గన్నవరం పంచాయితీరోడ్ మిలిటరీయల్ సిబ్బంది కార్యవర్గానికి ఏకగ్రీవంగా ఈ కింపివారు మొన్న ఎన్నికయ్యారు: అధ్యక్షులు: శ్రీ ఎ. ఎస్. ప్రసాదరావు. ఉపాధ్యక్షులు: శ్రీ హెచ్. వి. సత్యనారాయణ. కార్యదర్శి: శ్రీ పి. నాగేశ్వరరావు. సహాయ కార్యదర్శి: శ్రీ ఎస్. వి. రత్తయ్య, కోశాధికారి: శ్రీ కె. వి. మోహనరావు. సభ్యులు: శ్రీ ఎ. రహిమాన్, శ్రీ వి. ప్రభుదాస్.

కోరుకొండ : భీమునిపట్నం పంచాయితీ సమితి అధ్యర్యాన ఇరుపుకులకు శ్రీలంక గ్రామ సహాయక శిక్షణ శిబిరాలు ఇటీవల సర్పంచ్ శ్రీ రెడ్డి జగన్నాథం అధ్యక్షతన జరిగాయి. భీమునిపట్నం బి. డి. ఓ. శ్రీ కె వీరభద్రస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పంచాయితీ అధ్యక్షులు రాజా పాగి పద్మనాభరాజు శిబిర ప్రారంభోత్సవం చేశారు.

గుడివాడ :- స్థానిక శ్రీ ఓరుగంటి సుబ్బారావు వసతి భవనంలో పాపుర్లు భారతీ సమితి అధ్యర్యాన శ్రీ కోగంటి దుర్గా మల్లికార్జునరావు రచించిన "పద్మశిఖావళి" గ్రంథావిష్కరణ ఇటీవల జరిగినది. శ్రీ నేమాని వెంకటప్పయ్య శాస్త్రి అధ్యక్షత వహించారు. శ్రీ కొమారి శ్రీరాములు శ్రీ చలపాని లక్ష్మీనారాయణవర్మ ప్రభృతులు ప్రశంసావిద్యాలను చదివారు. శ్రీయుతులు వేదం రామప్రభువు, కరెపిల్ల నరసింహం, యల్లంరాజు విజయరామయ్య, మల్లంపల్లి, రామలింగేశ్వరశర్మ, గుళ్ళపల్లి రామబ్రహ్మం, పేమూరి రామకృష్ణయ్య ప్రభృతులు శ్రీ రావు కవితా వైశిష్ట్యతను కొనియాడారు.

విశాఖపట్టణం : మొన్న ఇక్కడ జిల్లా కలెక్టరు శ్రీ అబిద్ హుసేన్ హాస్టల్ ఊటీ మూవ్ ఆడిటోరియమ్‌కు ప్రారంభోత్సవం చేశారు. సభకు పురపాలక సంఘం చెయిర్మన్ శ్రీ టి ఎస్. ఎన్ రాజు అధ్యక్షత వహించారు. శ్రీ ఆర్. భరతన్ అతిథులకు స్వాగతం చెప్పారు. అల్పాహారవిందు పిదప విజయనగరం మహారాజా సంగీత కళాశాల విద్యార్థి బృందంవారు పాటకచేరి చేశారు.

రాజమండ్రి : ఇటీవల జిల్లా ఉపాధ్యాయ యూనియన్ కార్యవర్గ సమావేశం ఇక్కడ శ్రీ గొడవర్తి శ్రీరాములు అధ్యక్షతన జరిగినది. కార్యదర్శి శ్రీ మారెళ్ళపూడి వీరభద్రరావు స్వాగతం పలికారు. తొలుత శ్రీ వేలూరి శివరామశాస్త్రి మృతికి తమ సంతాపం వెలిబుచ్చారు. జిల్లా ఏజన్సీ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ దొంకాడ రామదాసు ప్రారంభోపన్యాసం కావించారు. శ్రీయుతులు జి. వి. శేషగిరి, వై. వి. శర్మ హనుంకోశం కృష్ణమాచార్యులు. జి. మల్యాలు వి. వి. సుబ్రహ్మణ్యం, ఎస్. డి వసంతరాయలు. ఎం. ఎస్. చౌదరి, ఎం. సత్తిరెడ్డి ప్రభృతులు మాట్లాడారు.

పాలకొల్లు : పట్టణ కూడలిప్రదేశంలో స్థానిక వితరణశీలి శ్రీ బంగారు రామారావు వదిన శ్రీమతి వెంకట సుబ్బమ్మ ఇచ్చిన 1,500 రూపాయల విరాళంతో 2,200 ఖర్చుపై సెయ్యి కిలో లీటర్లు కెపాసిటీ ఎత్తిమిది టేప్స్ కలిగిన వాటర్ టేంకుకు ప్రారంభోత్సవం కావించారు.

కాకినాడ : పెద్దకన్నలి పంచాయితీ సమితి ప్రాథమిక పాఠశాల బాలానంద సంఘం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల వస్తు ప్రదర్శనశాలను కాకినాడ పంచాయితీ సమితి మండల పరిశీలకుడు శ్రీ వై. సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రారంభోత్సవం చేశారు. సమావేశానికి పుమెన్ అసిస్టెంట్ సర్జన్ కుమారి ఎ. సుహాసిని అధ్యక్షత వహించారు. హైస్కూల్ హెడ్ మాస్టర్ శ్రీ రామచంద్రరావు, సమితి ప్రెసిడెంటు శ్రీ కన్నలి చిన్నరామిరెడ్డి, విద్యా విస్తరణాధికారి శ్రీ పి. లక్ష్మయ్య ఉప విద్యాధికారి శ్రీ హనుమంతరావు తొటంబేడు విద్యా విస్తరణాధికారి శ్రీ రామకృష్ణశాస్త్రి ఉపన్యసించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. ఎస్. అశ్వత్థకృష్ణమూర్తి సహోపాధ్యాయ, ఉపాధ్యాయినుల సహకారంతో సభ జయప్రదంగా ముగిసినది. పిల్లలకు మిఠాయిల పంపకం. నాట్యపోటీలు జరిగాయి.

విజయవాడ: బ్రాహ్మణ యాజ్ఞికసంఘం సర్వసభ్య సమావేశం మొన్న జరిగినది. ఈ క్రిందివారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. శ్రీ బిమ్మిగడ్డ శీతారామయ్య అధ్యక్షులు. శ్రీ రెంటచింతల సుందరరామశాస్త్రి ఉపాధ్యక్షులు, శ్రీ కప్పగంతుల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి. శ్రీ వల్లి వెంకట్రామశాస్త్రి. సహాయ కార్యదర్శి. శ్రీ చిలకలూరి వెంకటేశ్వర్లు, సభ్యులు: శ్రీయుతులు అక్కిచెర్ల రాధాకృష్ణమూర్తి, కోట గోపాలకృష్ణయ్య, గార్లపాటి రాజేశ్వరావధానులు, కాళావధుల సత్యనారాయణ, బూరుగుల పూర్ణచంద్రశాస్త్రి, తాడేపల్లి శేషయ్య. కోట వెంకట నరసింహమూర్తి, భాగవతుల సత్యనారాయణ, అంబడిపూడి మాధవశర్మ, ముద్దపల్లి మురళీ మోహన శర్మ.

నరసరావుపేట : ఇక్కడికి 15 మైళ్ళ దూరాన వున్న సంతమాగులూరు సమితిలోని పెల్లలచెర్వు గ్రామంలో విద్యుద్దీకరణకు రాజ్యసభ సభ్యులు శ్రీ కె వెంకట రెడ్డి ఇటీవల ప్రారంభోత్సవం చేశారు.

సంద్యాల : స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఈ సంవత్సరం నూటికి నూరు పాళ్ళు పన్నులనువసూలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకొనిచ్చింది సెక్రటరీ శ్రీ వె. వి. రమణారెడ్డిని సన్మానించారు. శ్రీ రెడ్డి కృతజ్ఞతను పెల్లడిస్తూ సిబ్బందిని అభినందించారు. మునిసిపల్ మేనేజరు శ్రీ కురుకుందప్ప, అకౌంటెంటు శ్రీ ఆర్. కె. నరసింహులు ప్రసంగించారు.

అహోబిలం : ఇటీవల అహోబిలం క్షేత్రంలో గరుడోత్సవం సందర్భంగా యాదవ సంఘం వారు మహాకవి పుట్టపర్తి నారాయణాచార్య కవిని రు 116 లతో సన్మానించారు. అంతకుముందు శ్రీ ముత్యాల పాటి నరసింహులు నాదస్వర కచేరి చేశారు.

డాక్యుమెంటరీ చిత్రాల ప్రాధాన్యం

కర్నూలు సభలో వివరణ

పత్తికొండ, ఏప్రిల్ 18-పంచవర్షప్రణాళికల ద్వారా దేశంలో జరుగుతున్న అభివృద్ధికృషిని గురించిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడానికి డాక్యుమెంటరీచిత్రాలు బాగా ఉపయోగపడతాయని హితవాది సంపాదకులు శ్రీ వసమా శంకరకర్మ 13 వ తేదీన ఇక్కడ విర్వహించబడిన డాక్యుమెంటరీ చిత్రాల ఉత్సవానికి అధ్యక్షత వహిస్తూ పేర్కొన్నారు. వర్షాభావంచేత ఏర్పడిన కరువు పరిస్థితిని గురించి తెలుసుకొన వలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశంలో జరిగే విషయాలను డాక్యుమెంటరీ చిత్రాలద్వారా తెలుసుకొనవచ్చని ఎత్తికొండ పంచాయతి సమితి అధ్యక్షులు శ్రీ పి. రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

గ్రామీణులకు చిత్రాల ద్వారా ఎక్కువ సమాచారాన్ని తెలియచేయవలసిన అవసరం వున్నదని జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ డి. ఎస్. పుల్లయ్య వివరించారు.

టౌన్ రీడింగురూమ్ కమిటీ అధ్యక్షులు ఆర్. బాల వెంకటస్వామి ప్రచారానికి గల ప్రాముఖ్యాన్ని గురించి వివరించారు.

ఆదోని, సంద్యాల, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లాలోని ఇతర ప్రాంతాలలో డాక్యుమెంటరీ చిత్రోత్సవాలు మే నెలలో జరుపబడతాయని వకలకు ఆహ్వానం చెబుతూ కర్నూలుపీఠం పబ్లిసిటీ డైరెక్టరేట్. పీఠం పబ్లిసిటీ అధికారి శ్రీ ఎస్. సుబ్బారావు పేర్కొన్నారు.

విజయవాడలో రు 2,500 ల విలువగల దొంగవస్తువుల పట్టివేత

విజయవాడ, ఏప్రిల్ 18— క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. అప్పారావు, డి. ఎస్. ఐ శ్రీ ఆర్. కె. మోసెస్ సహాయంతో విజయవాడకు చెందిన బాలుని వద్ద ట్రాన్‌సిస్టర్ రేడియో వుందన్న పట్టుకున్నారు.

తదుపరి రెండు ట్రాన్‌సిస్టర్ రేడియోలు, ఎనిమిది అలారం గడియారాలు, రెండురిస్టు వాచీలను పట్టుకొని వారిని అరెస్టు చేశారు. ఈ వస్తువుల విలువ రు 2 500 ల వుంటాయని భావించ బడుతున్నది. ఈ కేసును గురించి దర్యాప్తు జరుగుతున్నది.

నరసరావుపేట వెనుకబడిన తరగతుల సంఘం

నర్సరావుపేట, ఏప్రిల్ 18— నర్సరావుపేట తాలూకా వెనుక బడిన తరగతుల సంఘం కార్యకర్తల సమావేశం 13వ తేదీన వెంకటేశ్వర బిల్డింగ్ ఆవరణంలో శ్రీ పిల్లి సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది.

తాలూకా వెనుకబడిన తరగతుల మహాసభలను నర్సరావుపేటలో జరుపుటకు అడహాక్ కమిటీని ఏర్పాటుచేశారు.

శ్రీ షేక్ అదంసాహేబును అడ్‌హాక్ కమిటి అధ్యక్షులుగా శ్రీ చిలకలపూడి అప్పారావు కందేపు వీరాచారి, శిరివేరి లక్ష్మయ్య, వేల్పుల వెంకట సుబ్బయ్య గార్లను ఉపాధ్యక్షులుగాను, శ్రీగద్దం కోటేశ్వరలావు, ప్రధాన కార్యదర్శిగాను శ్రీ వణిదవు విశ్వేశ్వరరావు శ్రీ మురుగుల బ్రహ్మానందంగార్లు సహాయ కార్యదర్శులుగాను, శ్రీ మోతే మాదయ్యగారు కోశాధికారిగాను నియమించారు.

ఏలూరులో సంస్కృత పండితునికి సన్మానం

ఏలూరు, ఏప్రిల్ 18—గత అర్థశతాబ్దిగా పట్టణంలో శాస్త్రీయ కర్ణాటక సంగీతంలో వందలాది శిష్యబృందాన్ని తయారుచేసిన స్థానిక ప్రముఖ వాయులీన విద్వాంసులు శ్రీ యిమగంటి బుచ్చిరామశాస్త్రిని శిష్యబృందం ఉగాదినాడు హేలాపుర సంస్కృత పాఠశాలలో సన్మానించారు. సభకు శ్రీ సి. కృష్ణమూర్తిపంతులు అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు సి.సి. నరసింహాచార్యులు, బచ్చోటి సీతారామయ్య, సి.ఎస్.టి. కాంతాదేవి, బి. శ్రీనివాసశాస్త్రి, భోగరాజు బుచ్చిరామయ్యపంతులు శ్రీ శాస్త్రి ప్రతిభను, బోధనాపటిమను ప్రస్తుతించారు. శ్రీ మల్లాది శ్రీరామమూర్తి, శ్రీ గుండు సుబ్రహ్మణ్యం కవి పద్యాలు పఠించారు.

శ్రీ శాస్త్రిగారికి కాశ్మీరు శాలువ, నూతన జరీవస్త్రాలు, రు. 116లు యిచ్చి సత్కరించారు.

కోటలోసమితి అరవ సమ్మేళనం

20 నుంచి 29 వ తేదీ వరకు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

నెల్లూరు, ఏప్రిల్ 18— నెల్లూరు జిల్లా కోట పంచాయతీసమితి అరవ సమ్మేళనం 20 నుంచి 29 వ తేదీ వరకు కోటలో పెద్దయెత్తున జరగనున్నది. రాష్ట్ర మంత్రులు, సినీ నటనటులు, ఇతర ప్రముఖులు పెక్కుమంది పాల్గొంటారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పశు ప్రదర్శనాలు, రైతుమహాసభ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

తొలిరోజున శ్రీ వనుపులేటి సిద్ధయ్య నాయుడు అధ్యక్షతన మంత్రి శ్రీ తోట రామస్వామి సమ్మేళనను ప్రారంభిస్తారు. మంత్రి రుద్రరాజు రామలింగరాజు ఉపన్యసిస్తారు. మరునాటి సభకు శ్రీ సిద్దారెడ్డి వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షత వహిస్తారు. స్పీకర్ శ్రీ వి. వి. సుబ్బారెడ్డి, మంత్రి శ్రీ కె విజయ భాస్కరరెడ్డి, వైస్-ఛాన్సలర్ శ్రీ వి. సి. రామనరావు ప్రసంగిస్తారు. శ్రీ కొంగర జగ్గయ్యను సన్మానిస్తారు.

22 వ తేదీన శ్రీ పొన్నలూరు కోటారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో మంత్రి శ్రీ వి. బి. రాజు, సినీ నటులు మాట్లాడతారు. 23 వ తేదీన శ్రీమతి రేవాల దమయంతీదేవి అధ్యక్షతన కుటుంబ నియంత్రణ సభ జరుగుతుంది. 24 న శ్రీ సిద్దారెడ్డి వెంకట్రామిరెడ్డి అధ్యక్షత వహించే సభలో సినీ నటులు మాట్లాడతారు. 25 వ తేదీ సభకు శ్రీ తిక్కవరపు రామిరెడ్డి అధ్యక్షత వహిస్తారు. వి. వి. సి. పెసిడెంటు శ్రీ కాకాని వెంకటరత్నం, సినీ నటనటులు ఉపన్యసిస్తారు.

26వ తేదీ సభకు శ్రీ పొన్నలూరు వీరరాఘవరెడ్డి అధ్యక్షత వహిస్తారు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి, శీవెంకటగిరి కుమార రాజా, మరుపూరు కోదండరామిరెడ్డి ప్రభృతులు ప్రసంగిస్తారు. 27 న జరిగే సభకు శ్రీ బెజవాడ పాపిరెడ్డి అధ్యక్షతవహిస్తారు. మంత్రి శ్రీకొండా లక్ష్మణ్ బాపూజి, సినీ నటినటులు మాట్లాడతారు.

28వ తేదీన పరిషత్తు చైయిర్మన్ శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డి, అధ్యక్షతన జరిగే జిల్లా రైతు మహాసభను ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారు. మంత్రులు శ్రీయుతులు జె. వి. నరసింగరావు పి. వి, నరసింహారావు, నలమోతు చెంచురామానాయుడు, కీలం సిద్దారెడ్డి, ఉపన్యసిస్తారు. చివరిరోజున సభకు శ్రీకోడూరు శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహిస్తారు. శ్రీ అక్కిచేనేని నాగేశ్వరరావు బహుమతిప్రదానం చేస్తారు.

కోట సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీ నల్లపరెడ్డి, శ్రీ వి వా సు లు రెడ్డి, శ్రీ యద్దలవేణుగోపాలరెడ్డి బి. డి, ఓ., ఎస్, ఇ. ఓ. లు శ్రీ పి. వట్టాభిరామయ్య, శ్రీ కె. శ్రీనివాసరావు, కోట సర్పంచ్ శ్రీ నల్లపరెడ్డి సుబ్బారెడ్డి ఇతర ప్రముఖులు కార్యక్రమాలను జయవంతంగా నిర్వహించడానికి చురుకుగా కృషిచేస్తున్నారు.

రామచంద్రపురంలో కన్సూమర్స్ స్టోర్సుకు ప్రారంభోత్సవం

రామచంద్రపురం, ఏప్రిల్ 18— తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురంలో పదవ తేదీన కన్సూమర్సు కోఆపరేటివ్ స్టోర్సుకు ప్రారంభోత్సవం రాయవరం సమితి సబ్ రిజిస్ట్రార్ జరిపారు. సమావేశానికి డాక్టరు చెలికాని రామారావు అధ్యక్షత వహించారు. సంఘం ప్రెసిడెంటు శ్రీ ఎచ్చిక సూర్యప్రకాశరావు సభను పరిచయం చేశారు. సెక్రటరీ శ్రీ గుప్పల శ్రీరాములు వివేదికను వినిపించారు.

శ్రీ పాపిరెడ్డి శ్రీరామమూర్తి మాట్లాడుతూ సంఘానికి కావలసిన కంట్రోల్ సరకులు ప్రభుత్వంవారివిగా సరఫరాచేయవలసిన, ప్రజలు సహకారంతో పాలకవర్గం కలిసి కొనసాగించవలసిన విజ్ఞప్తి చేశారు. శ్రీ పళ్ళ సుబ్బారావు కూడా ఉపన్యసించారు.

విజయవాడలో పొగాకు కార్మిక సంఘం ఎన్నికలు

విజయవాడ, ఏప్రిల్ 18— నేషనల్ టుబాకో కంపెనీ జాతీయ కార్మిక సంఘం ఇటీవల ఇక్కడి భవానీపురం కంపెనీ వద్ద వార్షిక సర్వసభ్య సమావేశంజరుపుకున్నది. పట్టణ లోగల వివిధ యూనియన్ల ప్రతినిధులు సందేశా లిచ్చారు. ఐ. ఎన్. టి. యు.సి.అర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ సి.హెచ్. సుబ్బారావు ఉపన్యసించారు. నూతన సంవత్సరానికి ఈ కింది కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు:

అధ్యక్షులు: శ్రీ కోడెబోయిన రాఘవరావు, ఉపాధ్యక్షులు: శ్రీ వి. పాండురంగారెడ్డి, శ్రీ దిడ్డి కోటయ్య ప్రధాన కార్యదర్శి: శ్రీ కె. వెంకటేశ్వరరావు, కార్యదర్శులు: శ్రీమతి సి. గంగమ్మ, శ్రీ టి. చిన్నయ్య, కోశాధికారి : శ్రీ వి. నాగభూషణరావు, మరి 14 మంది సభ్యులు.

పాతభైదీకి ఆరునెలల శిక్ష

విజయవాడ, ఏప్రిల్ 18— ఇటీవల గవర్నరుపేటలో ఒక ట్రైన్ ఆఫీసులో జరిగిన చోరీ సందర్భంలో షేక్ మస్తాన్ అనే అసామి పై స్థానిక నేర పరిశోధనశాఖ అధికార్లు, స్థానికి జ్యూడిషియల్ ప్రథమ తరగతి మేజిస్ట్రేటు వద్ద కేసు దాఖలు చేశారు.

న్యాయాధికారి ముద్దాయికి ఆరునెలలు శిక్షవిధించారు.

ముద్దాయి స్వాధీనంలో 42 కిలోల పైపులు పోలీసు అధికార్లు స్వాధీన పర్చుకున్నారు.

విశాఖలో "హెవీప్లేట్స్, వెసల్స్" కర్మాగారం

-నిర్మాణ కృషిలో తగు పురోగతి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విశాఖపట్నం, ఏప్రిల్ 18 — పారిశ్రామిక అభివృద్ధి మంత్రిత్వశాఖ విశాఖ పట్టణంలో నెలకొల్పుతున్న, హెవీప్లేట్సు, వెసల్స్ ఫ్యాక్టరీకి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 450 ఎకరాల భూమిని, 12 లక్షల రూపాయలను మంజూరు చేసినది. పరిశ్రమల జాయింట్ డైరెక్టరు శ్రీ కె. సి.రావు వర్యవేక్షణలో 1,40 000 చదరపు మీటర్ల భూమిని ఆరు లక్షల రూపాయల వ్యయంతో చదును చేశారు. ఈ ప్రాజెక్టును నేషనల్ ఇండియన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు సాంకేతిక సలహాదారులు.

శ్రీ కె ఎస్. రావు ఈ నిర్మాణానికి ప్రధాన ఇంజనీరుగా వ్యవహరిస్తున్నారు. లోగడ ఈయన బిలాయ్, మరికొన్ని ఇతర నిర్మాణాలలో ప్రాజెక్టు పనిని క్షుణ్ణంగా పర్యవేక్షించి విశేష పరిజ్ఞానం పొందారు.

ఇటీవల ఇక్కడ బోర్డు డైరెక్టర్ల సమావేశం జరిగినది. శ్రీయుతులు కె. బి. నరసన్న, సతీష్‌చంద్ర ఐ. సి. ఎస్, కస్తూరి రంగన్, ఆర్. వి. సుబ్రహ్మణ్యం, గోవిందరాజన్, కె, ఎస్. శర్మ ప్రభృతులు ప్రాజెక్టు అధ్యక్షులు శ్రీ పి. బసిరెడ్డి అధ్వర్యాన సమావేశామై నిర్మాణంపని చురుకుగా పోరు వుగా జరపడానికి సమాలోచనలు జరిపారు.

ప్రాజెక్టు పని చురుకుగా సాగేందుకు మూడు కిలో మీటర్ల, 11 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి సరఫరా 500 కిలోవాట్ల సబ్‌స్టేషన్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష గాలన్ల మంచి నీటిని నిల్వ అందించడానికి వీలుగ పది పెద్ద బావులను ప్రత్యేక పంపుల ద్వారా సివిల్ ప్రాజెక్టు పనులకు ఉపకరించే పదుపాయాన్ని కల్పించారు.

వచ్చే నెలాఖరుకు కర్మాగారానికి తుది రూపం వచ్చేందుకు వీలుగ ప్రాజెక్టు అధికార్లు అన్ని చర్యలు తీసుకొన్నారు.

ఒకటిన్నర కోట్ల రూపాయల వ్యయంతో ఉక్కు మెషీన్ల నిర్మాణం, ప్రధాన కార్యాలయానికి కాంక్రీటు పోరల నిమిత్తం ఎస్టిమేటుతో పని ముగిందడానికి పెండర్లను పిలిచారు.

చతుర్థ ప్రణాళికలో ముఖ్యంగా విశాఖపట్టణ పారిశ్రామికాభివృద్ధికి, కొంత వరకు నిరుద్యోగులకు, సాంకేతిక నిపుణులకు పని కల్పించడానికి ఈ హెవీప్లేట్సు, వెసెల్స్ కర్మాగారం దోహదం కాగలదని ఆశిస్తున్నారు.

ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం ఇంజనీరు శ్రీ కె. ఎస్. రావు స్థానిక పత్రికా ప్రతినిధులకు ప్రాజెక్టు సమాచారాన్ని అందించి, ప్రాజెక్టు ప్రాంతానికి తీసుకువెళ్ళి జరుగుతున్న నిర్మాణాత్మక కృషిని ప్రదర్శించారు.

దీనికి గత జనవరిలో కేంద్ర మంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య శంకుస్థాపన చేసిన విషయం "ఆంధ్రజ్యోతి" పాఠకులకు విదితమే.

దేశంలో సాంఘిక సంక్షేమ కృషి

రాజమండ్రిలో శ్రీమతి మసూమా బేగం ప్రసంగం

("ఆంధ్రజ్యోతి విలేకరి")

రాజమండ్రి, ఏప్రిల్ 18— దేశంలో ఆర్థిక, సాంఘిక పరిస్థితులు చాలా అధ్వాన్నంగా వున్నాయని, మహిళల, బాలబాలికల పురోభివృద్ధి సాధనకు సేవా సంస్థలకు కేంద్ర సాంఘిక,సంక్షేమ మండలి గాంటులు ఇస్తున్నదని మండలి అధ్యక్షురాలు శ్రీమతి మసూమా బేగం చెప్పారు.

శ్రీమతి మసూమాబేగం హైదరాబాద్ నుంచి మొన్న ఇక్కడికి వచ్చారు.

స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థలు అనేకంగ కనిపిస్తూతమ జీవకారణ్య సంఘంలో శ్రీమతి మసూమా బేగంను సన్మానించారు.

ఈ సన్మాన సభకు జిల్లా పెషన్స్ జడ్జి బి. రామ్‌లాల్ కిషన్ అధ్యక్షత వహించారు.

వివిధ రాష్ట్రాలలో 59 సంస్థలకు 67 జనవరి నెలాఖరు వరకు రు 5.58 లక్షలను ప్రణాళికా కాలం గ్రాంట్లు క్రింద మంజూరు చేశారని శ్రీమతి మసూమాబేగం చెప్పారు. ఈ గ్రాంట్లు సద్వినియోగం అయ్యేటట్టు చూడవలసిందిగా ఆ సంస్థల కార్యకర్తలకు ఆమె విజ్ఞప్తి చేశారు:

జీవకారుణ్య సంఘం సంస్థాపకుడు శ్రీ కారుణ్యానందస్వామి, అధ్యక్షుడు డాక్టర్ ఎ. వి. నాగేశ్వరరావు. అద్దేపల్లి వివేకానంద దేవి ప్రసంగాలు చేశ

అయిదు లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యాలు

కేంద్రమంత్రి కె. ఎల్. రావు వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) విజయవాడ, ఏప్రిల్ 18—

అయిదు లక్షల ఎకరాలకు నీటిని సరఫరా చేసేందుకు ఉద్దేశించిన చిన్నతరహా ఇరిగేషన్ పథకాలను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందని వీటి అమలుకు 17 కోట్ల రూపాయలు వ్యయమవుతుందని కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖమంత్రి డాక్టరు కె. ఎల్ రావు నిన్న ఇక్కడ పత్రికా ప్రతినిధులకు తెలియచేశారు.

రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి, కృష్ణాజిల్లా శాసన సభ్యులు, జిల్లా సమితుల అధ్యక్షులతోను చర్చలు జరిపిన తర్వాత శ్రీ రావు ఈవిషయాన్ని తెలిపారు.

రాష్ట్రంలో అధికాహారోత్పత్తిని పెంచేందుకు ప్రాజెక్టులను సత్వరం అమలు చేయవలసిన అవసరత వున్నదని ఆయన చెప్పారు.

రాష్ట్రమంత్రి శ్రీ సిద్ధారెడ్డి మాట్లాడుతూ, కేటాయించిన 17 కోట్ల రూపాయలలోను అయిదుకోట్లను మాత్రమే వెచ్చించారని, రాష్ట్రంలో నెలకొని వున్న క్లిష్టమైన ఆర్థిక పరిస్థితిదృష్ట్యా మిగతా 12 కోట్లను కేటాయించలేకపోయామని, ఈమొత్తంలో ఆరవ వంతును మాత్రమే ప్రస్తుత పరిస్థితులలో విడుదల చేయగలిగామని తెలిపారు.

ఐదులక్షల రూపేణా పది కోట్ల రూపాయలను కేంద్రం సహాయం చేస్తే ఈ ప్రాజెక్టులను పూర్తిచేయడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

ఈ ప్రాజెక్టులపని పూర్తి అయితే 15కోట్ల రూపాయల విలువగల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతాయని. ఈవిధకాలలో బాలవాడికి రెండు ఇరిగేషన్ అవసరమని ఆయన అన్నారు.

జంటనగరాలలో అయిదుచోట్ల అగ్నిప్రమాదాలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 18— జంటనగరాలలో మొన్న అయిదుచోట్ల అగ్నిప్రమాదాలు సంభవించాయి.

హబ్సిగూడలో ఒక ఇంటిలో ఎలెక్ట్రిక్ షార్టు సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది గొలిపుడా దాడుస్సలాంల నుంచి అగ్నిమాపక యంత్రాలు ప్రమాదస్థలానికి వెళ్ళి మంటలను ఆర్పివేశాయి 10 వేల రూపాయల ఆస్తి నష్టమైపోయినదని అంచనా.

నీకిందరాబాదులో ఒకచోట పుంచబడిన ఒక మోటార్ సైకిలు ఇంజన్‌లోంచి నిప్పురవ్వ పైకివచ్చి అంటుకొని తగులబడిపోయినది. ఫస్టుగ్రేడ్ ప్రమాద స్థలానికి వెళ్ళి మంటలను ఆర్పింది.

కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ఎదురుగా వున్న ఒక పూరిల్లు నిప్పంటుకొని తగులబడిపోయింది. అందులో వున్న భార్య భర్త తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాద స్థలానికి అగ్నిమాపక దళం వారు హుటాహుటిన వెళ్ళి మంటలను ఆర్పివేశారు గాయపడ్డ దంపతులను ఆసుపత్రిలో చేర్చారు.

జామ్బేగ్ బజార్‌లో ఒక దిన్న అగ్నిప్రమాదం సంభవించింది ఒక గుడిశె తగులబడిపోయినది 50 రూపాయలు విలువగల వస్తువులు నష్టమైపోయాయి.

మోజంజాహీ మార్కెట్‌కు ఎదురుగా వున్న ఒక సైనిక వాహనానికి నిప్పంటుకొని తగులబడిపోయినది ఈ అయిదు చోట్లకు వెళ్ళిన అగ్నిమాపక దళాలకు స్టేషన్ ఆఫీసర్ శ్రీ ఎమ్. అక్తార్ నేతృత్వం వహించారు.

శ్రీ ఎం. జగన్నాథరావు

హైదరాబాద్, ఏప్రిల్ 18— బందరు భారతమెరైన్‌కు చెందిన శ్రీ ఎం. జగన్నాథరావు మార్మాగోవా (గోవా) పోర్టుట్రస్టు బోర్డుకు ఆంధ్ర వాణిజ్య మండలి ప్రతినిధిగా ఎన్నికయ్యారు.

ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్‌కు నామినేటు చేయబడిన శ్రీమతి బొమ్మకంటి శివకామమ్మ

"ఆధునికాంధ్ర కవిత్వము"

రాష్ట్ర విద్యామంత్రిచే గ్రంథావిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 18— ప్రముఖకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి రచించిన "ఆధునికాంధ్ర కవిత్వము" అనే తెలుగు సాహిత్య విమర్శక గ్రంథాన్ని రాష్ట్ర విద్యామంత్రి శ్రీ టి. బి. రాఘవులు మొన్న సాయంత్రం ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యాన జరిగిన ఒకసభలో ఆవిష్కరించారు.

శ్రీ దేవులపల్లి రామానుజరావు స్వాగతం చెప్పారు. శ్రీయుతులు దివాకర్ల వెంకటావధాని, కె. లక్ష్మీరంజనం రచయిత శక్తి సామర్థ్యాలను ప్రశంసించారు. రచయిత వారి శిష్యుడు కూడా.

శ్రీ అడపా రామకృష్ణారావు గ్రంథాన్ని సమీక్షించారు. రచయిత సమునిత రీతిని సమాధానం చెప్పారు. డాక్టరు ఎళ్ళ దుర్గారావు వందన సమర్పణ చేశారు.

సభలలో పూలదండలపై వృథా వ్యయం

చేయరాదని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హితవు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్ ఏప్రిల్ 18— సభలను సమావేశాలను ఏర్పాటు చేసేవారు పూలదండలపై వృథావ్యయంచెయ్యక, అడబ్బును ప్రయోజనకరమైన వాటికి వినియోగించాలని రాష్ట్ర సమాచార, కార్మిక శాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్‌బాపూజీ సమావేశ కార్యకర్తలకు హితవు చెప్పారు.

కార్యకర్తలు పూలదండలువేసి వృథా వ్యయంచేసే సభలకు తాను హాజరుకానని ఆయన అన్నారు.

శ్రీ కొండా లక్ష్మణ్‌బాపూజీని శ్రీ వి. బి. రాజును సన్మానించడానికి రామ్‌కోట్ మండల కాంగ్రెసు సంఘం దివ్యజ్ఞాన సమితి హాలులో మొన్నసాయంత్రం ఒక సమావేశం ఏర్పాటుచేసింది.

ఈ సమావేశంలో ప్రసంగిస్తూ, శ్రీ బాపూజీ ఈ విధంగా చెప్పారు.

30 సంవత్సర తరవున పెద్దపెద్ద పూలదండలు ఈ ఇరువురు మంత్రులకు వేయడానికి తేబడినవి.

విజయవాడలో గీతాజ్ఞానయజ్ఞం

విజయవాడ, ఏప్రిల్ 18— కేంద్ర నీటిపారుదల విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి ఈ నెల 18 వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఇక్కడ గవర్నర్‌పేటలో చల్లపల్లి రాజా బంగళా ఆవరణలో గీతా యజ్ఞమునకు ప్రారంభోత్సవం చేస్తారు.

శ్రీ దయానందస్వామి 19 వ తేదీనుంచి మే ఎనిమిదవ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు భారత మహిళామండలిలో గీతోపనిషద్ ప్రవచనము సాయంత్రం 6.30 గంటల నుంచి ఎనిమిది గంటలవరకు చల్లపల్లి రాజా బంగళా ఆవరణలో భగవద్గీత అయిదు ఆరు అధ్యాయములపై ఉపన్యాసములు ఇస్తారు.

క్రీడాభిరామం

వై. ఎమ్. సి. ట్రోఫీ వాలీబాల్:

సెమీఫైనల్స్‌కు ఆంధ్రప్రదేశ్ పోలీసుల జట్టు చేరిక

తిరుచూరు, ఏప్రిల్ 18—

ఇక్కడకు 20 మైళ్ళ దూరంలో వున్న మతిలకం వద్ద నిన్న జరిగిన వై. ఎమ్. సి. ట్రోఫీ వాలీబాల్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆంధ్ర పోలీసుల (హైదరాబాదు) జట్టు కేరళ పోలీసుల జట్టు (త్రివేండ్రం)ను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకొన్నది

మూడు సరాసరి గేములలో ఆంధ్ర పోలీసులజట్టు 15-9, 15-11, 15-6 స్కోరుతో కేరళపై ఘనవిజయాన్ని సాధించింది

నిన్న జరిగిన ఈ వాలీబాల్ టోర్నమెంట్‌కు కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ పి. గోవిందమీనన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు

మొన్న జరిగిన మ్యాచ్‌లో కేరళ పోలీసుల జట్టు 3 1 స్కోరుతో ఏ. ఓ. సి. సికిందరాబాదు జట్టుపై విజయంపొందినది.

అహమ్మదాబాద్ వాలీబాల్ టీలకు సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు

అహ్మదాబాద్, ఏప్రిల్ 18— అఖిల భారత పారిశ్రామిక కార్మికుల వాలీబాల్ టోర్నమెంట్ ఇక్కడ 19 నుంచి 1 వ తేదీ వరకు నిర్వహింపబడతాయి.

బదర్ కప్ (న్యూఢిల్లీ) సౌత్ సెంట్రల్ రైల్వే (హైదరాబాద్) మహారాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు (బొంబాయి). భిలాయ్ ఉక్కు కర్మాగారం (మధ్యప్రదేశ్). దుర్గాపూర్ ఉక్కు కర్మాగారం (పశ్చిమ బెంగాల్). అజ్మీర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ (అజ్మీర్). హిందుస్తాన్ ఎయిర్‌క్రాఫ్ట్ (బెంగుళూరు). గుజరాత్ లేబర్ వెల్ఫేర్ బోర్డు "ఎ" "బి" జట్టు ఈ టోర్నమెంటులో పాల్గొంటున్నాయి.

వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో జపాన్‌కు రెండు పతకాలు

ఫైనల్స్‌లో పురుషులతోపాటు స్త్రీల జట్టు కూడా విజయం

స్టాక్‌హోమ్, ఏప్రిల్ 18— ఇక్కడ నిన్న రాత్రి జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్స్‌లో ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన పురుషుల, స్త్రీల జట్టులు రెండు గెలుపొందాయి.

ఈ విజయంలో పురుషుల సైటిల్, స్త్రీల సైటిల్ కూడా) జపాన్ తైవసమయ్యాయి పురుషుల సైటిల్‌ను 1959లో ఒకసారి జపాన్ లభ్యం చేసుకొన్నది.

జపాన్, ఉత్తర కొరియాల మధ్య జరిగిన ఫైనల్స్‌లో జపాన్ జట్టు 5-3 స్కోరుతో గెలుపొందింది. పొనెషోవ్ స్టేడియంలో జరుగుతున్న ఈ ఫైనల్ మ్యాచ్‌ను చూడడానికి 13 వేల మందికి పైగా క్రీడాభిమానులు వచ్చారు.

మహిళల ఫైనల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో జపాన్ మహిళ జట్టు సోవియట్ మహిళల జట్టును 3-0 స్కోరుతో ఓడించింది.

మొదటి గేములో ఉత్తర కొరియా ఆధిక్యతనుప్రదర్శించింది. అయితే రెండవగేములో

మాడ్రిడ్‌లో అంతర్జాతీయ హాకీ పోటీలు

పాల్గొనే ఇండియా జట్టుకు కెప్టెన్‌గా పృథీపాల్ సింగ్

జలంధర్, ఏప్రిల్ 18— మాడ్రిడ్ ఇంటర్నేషనల్ హాకీ ఫెస్టివల్‌లో పాల్గొనే ఇండియా జట్టుకు పద్మశ్రీ పృథీపాల్‌సింగ్ నాయకత్వం వహిస్తారు.

ఇండియా జట్టులో 18 మంది క్రీడాకారులుంటారని ఈ జట్టు మాడ్రిడ్ హాకీ ఫెస్టివల్‌లోను, తదితర యూరప్ దేశాల పర్యటనలోను పాల్గొంటుంది

లక్నో క్రికెట్‌కు హైదరాబాద్ బ్లూస్ జట్టు

లక్నో, ఏప్రిల్ 18— ఇక్కడ మే అయిదవ తేదీ నుంచి ప్రారంభం కానున్న శేష్ మహల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మొత్తం దేశం నుంచి 20 జట్టులు వచ్చాయి

27 రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రముఖ టెస్టు క్రికెటర్లు పాల్గొనగలరని తెలుస్తున్నది

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) స్టేట్‌బ్యాంక్ ఆఫ్‌ఇండియా, మద్రాసు అర్జిన్స్ ఫ్యాక్టరీ, బందీపూర్ (మహారాష్ట్ర) హైదరాబాదు బ్లూస్ మున్నగు ప్రముఖ జట్టులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి.

వీరంతా నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడతారు.



నెల్లూరు జిల్లా - మాధవి పిక్చర్సు (జ్యోతి రిలీజు)
గుంటూరు జిల్లా - విశ్వశాంతి డిస్ట్రిబ్యూటర్సు (విజయవాడ-3.)

జడ్చర్లలో అగ్నిప్రమాదం

ప్రభుత్వ ఆసుపత్రిభవనందగ్ధం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

పెద్దాపురం, ఏప్రిల్ 18— అడ్డతీగల పంచాయతీ సమితికి చెందిన జడ్చంగిలో 18వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రభుత్వ ఆసుపత్రిభవనం, స్టోరీరూమ్, మందుల విభాగం ధ్వంసమైపోయాయి ఆ ఆసుపత్రికి చెందిన మొబైల్‌వ్యాన్ డ్రైవర్, క్లీనర్ మంటలకు గురై ప్రమాదపరిస్థితిలో వున్నారు. వెంటనే వారిద్దరిని కాకినాడ జనరల్ ఆసుపత్రికి చేర్చారు.

ఈ అగ్ని ప్రమాదంవార్త అందినవెంటనే పెద్దాపురం అగ్నిమాపక అధికారి శ్రీ మహమ్మద్‌హుస్సేన్ తమసిబ్బందితో జడ్చంగికెళ్ళి మంటలను అదుపులోనికి తెచ్చారు.

ఈ ప్రమాదాన్ని గురించి శ్రీ మహమ్మద్‌హుస్సేన్ "ఆంధ్రజ్యోతి" విలేకరితో మాట్లాడుతూ, పీపాలోనుంచి పెట్రోలును తోడుతూ వుండగా పొరపాటున ఒకరు అగ్గిపుల్లను వెలిగించి నందువల్ల ఈప్రమాదం జరిగిందని తనకు తెలిసినట్టు చెప్పారు.

జగ్గయ్యపేట పంచాయతీలో పూర్తిగా పన్నుల వసూలు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 18— జగ్గయ్యపేటపంచాయతీకి 1966-67 సంవత్సరంలో వసూలు చేయవలసిన పన్నులు మొదలయిన వాటిని సర్పంచ్, సభ్యులు, ఆఫీసు సహకారంతో నూటికి నూరుపాళ్ళు వసూలు చేశారు.



Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd. Vijayawada-2.
Editor : Narla Venkateswara Rao